



తవ్వేసిందెవరో.. తెలియదంట



నేతలు తవ్వేసిన కోటప్పకొండ - కొత్తపాలెం రహదారి

- కోటప్పకొండ - కొత్తపాలెం రోడ్డుపై రాకపోకలకు తిప్పలు
- తమకే టెండర్ అన్న ధీమాతో స్థానిక నేతల నిర్వాకం
- చర్యలు తీసుకోవడంలో పంచాయతీరాజ్ అధికారులు తాత్సారం
- రోడ్డు పునరుద్ధరించకుంటే తిరునాళ్ల భక్తులకు తిప్పలే

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

అధికారం మాదే.. ఏం చేసినా అడిగేవారు లేరు.. మా ఇష్టం.. అన్న రీతిలో నరసరావుపేటలో స్థానిక నేతలు వ్యవహరిస్తున్నా రనేందుకు కోటప్పకొండ.. కొత్తపాలెం (అవిశాయపాలెం) రోడ్డును తవ్వేయడమే నిదర్శనం. ఎటువంటి అనుమతులు లేకుండానే నేతలు బరితెగించారన్న విమర్శలు వస్తున్నాయి. తమకే టెండరు వస్తుందన్న ధీమాతో ముందు వెనుక చూడకుండా రోడ్డును తవ్వేశారు. ఈ ఘటన తమకు తెలియదని.. తమకు చెప్పకుండానే తవ్వేశారంటున్న పంచాయతీరాజ్ అధికారులు చర్యలపై తాత్సారం చేస్తున్నారు. తిరునాళ్ల భక్తులకు మరిన్ని వసతులు కల్పించేందుకు కృషి చేయాల్సిన కూటమి నేతలు ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. గోతుల మయంగా ఉన్న కోటప్పకొండ - కొత్తపాలెం రహదారిని పునర్నించేందుకు పంచాయతీరాజ్‌శాఖ రూ.4 కోట్లకు అంచనా వేసి టెండర్లు ఆహ్వానించింది. ఇంతలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అధికారులు టెండర్‌ను ఆమోదించలేదు. దీంతో రహదారి పునర్నించేందుకు అవకాశం లేకుండా పోయింది. అయితే టెండర్ ఖరారు కాక ముందే పనులు ఆశించిన కొందరు టీడీపీ నేతలు ముందుగానే రహదారిని తవ్వేశారు. దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయి. యలమందల రహదారిలో తిరునాళ్ల ప్రభలు వచ్చే సమయంలో వాహనాలను కొత్తపాలెం రహదారిలోకి మళ్లిస్తారు. రహదారి తవ్వేయడంతో తిరునాళ్ల రోజున వాహనాలను మళ్లించే పరిస్థితులు లేకుండా పోయాయి. తిరునాళ్లకు 20 రోజులే సమయం ఉంది. అప్పటికల్లా తవ్వేసిన రహదారిని పునరుద్ధరించకుంటే యాత్రికులకు తిప్పలు తప్పవు.



పది రోజుల్లో పునరుద్ధరింప చేస్తాం..

తిరునాళ్ల దృష్ట్యా ఎన్నికల కమిషన్‌ను నుంచి రహదారి నిర్మాణానికి ప్రత్యేక అనుమతి పొంది పనులు చేపట్టాలి. ఇందుకు ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు, పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు కృషి చేయాలి. లేకుంటే కూటమి నేతలు చేసిన నిర్వాకానికి వారే బాధ్యత వహించాల్సి ఉందన్న వాదన ఉంది. రోడ్డు తవ్వేందుకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని చెబుతున్న ఎస్సీ బ్రహ్మయ్య సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. కాగా స్థానిక పంచాయతీరాజ్ అధికారి మాట్లాడుతూ తవ్వేసిన వారితోనే రానున్న పది రోజుల్లో రోడ్డును పునరుద్ధరింప చేస్తామని చెప్పారు.

సేద్యానికి..డ్రోన్లు

- సమయం ఆదా.. ఖర్చుల్లో మిగులు
- సాంకేతిక వ్యవసాయంపై ప్రభుత్వం దృష్టి
- తొలుత మండలానికి ఓ యూనిట్ మంజూరు
- ఇప్పటికే గ్రూపుల ఎంపిక పూర్తి.. శిక్షణకు సన్నాహాలు

50 శాతం సబ్సిడీ..

డ్రోన్ యూనిట్ వ్యయం గరిష్ఠంగా రూ.15 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో 50 శాతం బ్యాంకు రుణ సదుపాయం అందించనుండగా, 40 శాతం రాయితీ రూపంలో ప్రభుత్వం ఇవ్వనుంది. మిగిలిన పది శాతం గ్రూపులోని రైతులు భరించేలా మార్గదర్శకాలు రూపొందించారు. గ్రూపులోని రైతులు తమ అవసరాలకు డ్రోన్‌ను వినియోగించుకుని ఆ తర్వాత నామమాత్రపు అద్దెకు ఇచ్చే వెసులుబాటు ప్రభుత్వం కల్పించింది. తద్వారా ఆ గ్రూపులోని రైతులకు ఆదాయం కూడా సమకూరనున్నది.

వ్యవసాయానికి.. సాంకేతిక సాయం. పురుగుల మందు పిచికారీ చేస్తూ.. ఎరువులు వేస్తూ.. మానవవనరుల కొరతను తీరుస్తూ.. ఐదు గంటల్లో నలుగురు కూలీలు చేసే పనిని గంటలో ఒక్కరితోనే చేస్తూ.. పంట పొలాల్లో డ్రోన్లు సందడి చేయనున్నాయి. సమయం ఆదా.. కూలీల కొరత.. పెట్టుబడిలో మిగులు డ్రోన్ల సేద్యంతో సాధ్యమని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా తొలి అడుగుగా సేద్యంలో డ్రోన్ల సేవలను వినియోగించుకునే దిశగా కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. తొలి విడతలో మండలానికి ఓ గ్రామాన్ని ఎంపిక చేసుకుని అక్కడ రైతులకు సాయంగా డ్రోన్లు వినియోగాన్ని అధికారు లు అందుబాటులోకి తేనున్నారు. దశలవారీగా అన్ని గ్రామాల్లోని రైతులకు డ్రోన్ల సేవలు అందేలా కార్యాచరణ రూపొందించారు. డ్రోన్ ఆపరేటింగ్‌కు సంబంధించి పైలెట్‌కు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని గుంటూరు, నరసరావుపేట, బాపట్ల కలెక్టరేట్ల వేదికగా చేపట్టడానికి వ్యవసాయ శాఖ సన్నాహాలు చేస్తోంది.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)


సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకుని వాటిని వ్యవసాయంలోకి కూడా ప్రవేశపెట్టి రైతులను సిద్ధం చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులేస్తోంది. వ్యవసాయంలో సంప్రదాయ విధానాలను వీడి లాభసాటి మార్గాలను అన్వేషించడంతో పాటు ఆ మెలకువలను రైతులకు శిక్షణ రూపంలో ఇవ్వడానికి కూడా వ్యవసాయ శాఖ సన్నద్ధమవుతోంది. ఈ క్రమంలో ఆధునిక సాంకేతికతకు నెలవుగా నిలుస్తోన్న డ్రోన్లను వ్యవసాయానికి ఉపయోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రైతులకు అన్ని విధాల అండగా ఉపయోగపడేలా డ్రోన్లను రూపొందిస్తున్నారు. సేద్యం నానాటికి భారమవ్వడం వెనుక పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరగడం ప్రధాన కారణంగా ఉంది. ముఖ్యంగా మానవవనరుల కొరత ఉండడంతో కూలి ఖర్చులు మోయలేనంతగా రైతులను కుదేలు చేస్తున్నాయి. డ్రోన్లను సమర్థంగా వినియోగించుకోగలిగితే ఎంతో (మిగతా 8వ పేజీలో)

అవస్థలు పోయి.. ఆదాయం

పురుగు మందులు, ఎరువుల పిచికారీ సమయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా గడచిన ఐదేళ్లలో పది మంది వరకు మృతి చెందారు. సేద్యంలోకి డ్రోన్లు రావడం వల్ల రైతులకు నేరుగా పురుగు మందులు కొట్టే అవస్థ తప్పనుంది. డ్రోన్లు దక్కించుకున్న గ్రూపులోని రైతులు తమ అవసరాలకు వాడుకోవడంతో పాటు ఇతర రైతులకు అద్దెకు ఇవ్వాలని ప్రభుత్వం మార్గదర్శకాల్లో తెలిపింది. ఎకరాకు రూ.400 వరకు అద్దె వసూలు చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది.



కుంభమేళాకు ఆర్టీసీ స్పెషల్ బస్సు
- టిక్కెట్ ధర రూ. 8,300



నగరవనంలో.. శిల్ప సోయగం

పట్టభద్రులను ప్రభావితం చేస్తే చర్యలు
ఎమ్మెల్సీ ఎన్నికల ఆర్‌వో నాగలక్ష్మి

ఆరు జిల్లాల్లో.. అనుమతులంటే ఎలా?
- సతమతమవుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థులు

8

నదుల అనుసంధానంపై "కదలిక"



- ఎత్తిపోతల నిర్మాణానికి భూముల పరిశీలన
- ఎర్రబాలెం వద్ద పనులను పరిశీలించిన జేసీ సూరజ్
- భూమి సేకరించేందుకు రెవెన్యూ శాఖ ఏర్పాట్లు

(నరసరావుపేట, క్రోసూరు - ఆంధ్రజ్యోతి)

నదుల అనుసంధానంపై కదలిక వచ్చింది. జలహారతి పథకం తొలివిడతలో సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలను తరలించనున్నారు. ఆయా పనులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఈ క్రమంలో కాంట్రాక్ట్ సంస్థ మెగా ఇంజనీర్లతో కలసి పల్నాడు జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్‌ఘనోరే అమరావతి మండలం వైకుంఠపురం, క్రోసూరు మండలం పీసపాడు గ్రామాల మధ్య పంపు హౌస్ నిర్మాణ పనులను పరిశీలించారు. భూసేకరణపై రెవెన్యూ అధికారులతో చర్చించి అవసరమైన భూములను పరిశీలించారు. ఇంజనీర్లకు, కాంట్రాక్ట్ సంస్థకు జేసీ పలు సూచనలు చేశారు. తహసీల్దార్ వేముల వెంకట నాగరాజు, సర్వేయర్ శ్రీధర్, వీఆర్‌వో ఇబ్రహీం, డీటీ శ్రీనివాసరావులతో పాటు కాంట్రాక్ట్ సంస్థ ఇంజనీరింగ్ నిపుణులు జేసీ వెంట ఉన్నారు. ఈ ప్రక్రియతో అనుసంధానంపై మరో అడుగు పడింది. ఈ పనులను గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించగా తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. తాజా గా ఈ పథకం నిర్మాణానికి కూటమి ప్రభుత్వం పూనుకోవడంతో పను ల్లో కదలిక వచ్చింది. ఎత్తిపోతల పథకంతో పల్నాడు, గుంటూరు, బాప ట్ల, ప్రకాశం జిల్లాల్లోని ఆయకట్టుకు మహర్దశ పట్టనున్నది. పనులను 2026 జూన్ కల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది.



పథకం ప్లాన్‌ను పరిశీలిస్తున్న జేసీ సూరజ్

కుడి కాల్వకు గోదారి..

జలహారతి తొలివిడత సాగర్ కుడికాల్వకు గోదావరి జలాలను తరలిస్తారు. జలహారతి తొలి ప్రయోజనం నాగార్జున సాగర్ జవహర్ కుడి కాల్వ ఆయకట్టు రైతులు పొందనున్నారు. నదుల అనుసంధానం తొలుత సాగర్ కుడికాల్వ వరకు చేపట్టనున్నారు. గోదావరి జలాలను బొల్లాపల్లి జలాశయంలో నిల్వ చేసి అక్కడి నుంచి బనకచర్ల రెగ్యులేటర్‌కు తరలించే పనులను మూడు దశలో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలిదశలో గోదావరి జలాలు 73 టీఎంసీలు మళ్లించి కుడి కాల్వ ఆయకట్టు 9.61 లక్షల ఎకరాలకు అందించాలన్నది ప్రధాన ఉద్దేశం. ఈ ఎత్తిపోతల పథకానికి 2018లో సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. రూ.6020 కోట్లతో ప్రారంభించగా రూ.1,016 కోట్ల పనులు పూర్తియ్యాయి. ప్రకాశం బ్యారేజీ ఎగువన మూడు పంపు హౌస్‌లు నిర్మించడంతో పాటు ఆరు వరసల్లో 4.57 కిమీ మేర పైపులు ఏర్పాటు చేసి నీటిని మళ్లిస్తారు. అక్కడి నుంచి 40 కిమీ పైగా కాల్వ తవ్వాల్సి ఉంది. మూడు సబ్ స్టేషన్లు నిర్మించాలి. రెండో ప్యాకేజీలో రెండు పంపుహౌస్‌లు నిర్మించాలి. 5.65 కిమీ మేర ఆరు వరసల పైపులు ఏర్పాటు చేయాలి. మరో 15.95 కిలోమీటర్లు కాల్వ తవ్వాలి. రెండు సబ్‌స్టేషన్లు నిర్మించాలి. ఈ ప్యాకేజీలోరూ.550 కోట్ల పనులు పూర్తి చేశారు. మరో 2,105.82 కోట్ల పనులు చేయాల్సి ఉంది. రెండు ప్యాకేజీలకు సంబంధించి సుమారు 466 ఎకరాలు భూ సేకరణ చేయాల్సి ఉంది. భూసేకరణ త్వరలోనే ప్రారంభం కానున్నది. 466 ఎకరాల భూమి అవసరమవుతుందని రెవెన్యూ అధికారులు అంచనా వేసి సర్వే చేశారు. అమరావతి, క్రోసూరు, రాజుపాలెం మండలాల గుండా నకరికల్లు మండలంలోని కుడి ప్రధాన కాల్వలో నీటిని కలుపుతారు. ఆయా మండలాల పరిధిలో భూసేకరణ కు రూ.1,044 కోట్లు వ్యయం అవుతుందని అంచనా. అమరావతి మండలం వైకుంఠపురం వద్ద కృష్ణానది నుంచి నీటిని, అక్కడి నుంచి 66.59 కిలోమీటర్ల పొడువునా పైపులైన్ నిర్మించి సాగర్ కాల్వ 80వ మైలు వద్దకు గోదావరి నీటిని ఎత్తిపోతల ద్వారా తరలించేందుకు పథకాన్ని రూపొందించారు. 56.50 కిలోమీటర్లు గురుత్వాకర్షణ ద్వారా నీటిని తరలిస్తారు. 10.09 కిలోమీటర్లు ఎత్తిపోతల ద్వారా నీటిని కుడి కాల్వకు తరలిస్తారు.



సౌత్ సెంట్రల్ నుంచి సౌత్ కోస్టుకు

- జోన్ మారనున్న గుంటూరు రైల్వే డివిజన్
- దక్షిణ మధ్య రైల్వేతో వీడిపోనున్న 30 ఏళ్ల బంధం

గుంటూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ సౌత్ సెంట్రల్ నుంచి సౌత్ కోస్టు జోన్‌లోకి మారనున్నది. ఇంచుమించు మూడు దశాబ్దాల పాటు దక్షిణ మధ్య రైల్వే(ఎస్‌సీఆర్) జోన్‌తో బంధం త్వరలో వీడిపోనున్నది. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో హామీ మేరకు కొత్త రైల్వే జోన్ దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ని కేంద్ర రైల్వేబోర్డు నోటిఫై చేసిన దృష్ట్యా ఇందులోకి మారబోతున్నది. విశాఖపట్టణం హెడ్‌క్వార్టర్స్‌గా సౌత్ కోస్టు రైల్వే జోన్ ఏర్పాటు కానున్నది. ఇప్పటివరకు డివిజన్‌పై దక్షిణ మధ్య రైల్వే జోన్ చిన్న చూపు చూస్తూ వచ్చింది. ఒకదశలో సంక్రాంతి, దసరా వంటి పండుగల రద్దీ సమయంలోనూ గుంటూరు మీదగా స్పెషల్స్ నడిపేది కాదు. ఇప్పుడు ఎలక్ట్రిక్ ట్రాక్షన్ అందుబాటులోకి వచ్చాక పరిస్థితిలో కొంత మెరుగైంది. త్వరలో విశాఖ హెడ్‌క్వార్టర్స్‌గా ఉండే సౌత్ కోస్టు రైల్వే జోన్‌లోకి గుంటూరు డివిజన్ మారిపోతుండటంతో ఇక ప్రాధాన్యాలు పెరుగుతాయని అంతా ఆశిస్తున్నారు. నిధుల కేటాయింపులు కూడా పెరుగుతాయన్నఅభిప్రాయాన్ని రైల్వేవర్గాలు వ్యక్తపరుస్తున్నాయి.

గుంటూరు డివిజన్ ఇలా..

ఎంపీల పోరాటాల అనంతరం గుంటూరు రైల్వే డివిజన్‌ని విజయవాడ నుంచి వేరు చేస్తూ 1995-96లో కేంద్ర రైల్వే శాఖ మంజూరు చేసింది. అయితే డివిజన్ ఆపరేషనల్‌కి దాదాపుగా ఎనిమిదేళ్ల పట్టింది. 2003 ఏప్రిల్ 1న అధికారికంగా గుంటూరు హెడ్‌క్వార్టర్స్‌గా ఏర్పడింది. కృష్ణా కెనాల్ - గుంటూరు, గుంటూరు - నంద్యాల, రేపల్లె - తెనాలి, తెనాలి - గుంటూరు, గుంటూరు - పగి డిపల్లి, నడికుడి - మాచర్ల, విష్ణుపురం - జాన్ పహాడ్, నంద్యాల - యర్రగుంట్ల, కొత్తగా నడికుడి - శ్రీకాళహస్తి సెక్షన్లతో డివిజన్ ఏర్పడింది. గుంటూరు రైల్వే డివిజన్ రెండు తెలుగు రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నది. గుంటూరులో 288.87 కిలోమీటర్లు, ప్రకాశం జిల్లాలో 156.70, కర్నూలులో 42.01, నల్గొండలో 102.64, యాదాద్రిలో 38.3, సూర్యాపేటలో 4 కిలోమీటర్ల రైల్వేట్రాక్‌ని కలిగి ఉన్నది. త్వరలో అమరావతి రాజధానికి రైలుమార్గం(ఎర్రుపాలెం-నంబూరు) ఏర్పాటు కాబోతున్నది. అయితే ఈ సెక్షన్‌ని అటు విజయవాడకు కేటాయిస్తారా... ఇటు గుంటూరు డివిజన్‌కి ఇస్తారా అన్న దానిపై రైల్వే శాఖ ఇంకా స్పష్టత ఇవ్వలేదు. చిట్యాల, నల్గొండ, మిర్యాలగూడ, విష్ణుపురం, నడికుడి, పొందుగుల, రెడ్డిపాలెం గూడ్స్‌షెడ్లు, నరసరావుపేట, నంద్యాల, జాన్ పహాడ్, నల్లపాడు(ఆర్ఎంసీ), శావల్యాపురం, వినుకొండ, దొనకొండలో సరుకు రవాణా సదుపాయాలు ఉన్నాయి. సిమెంట్ రవాణా కోసం విష్ణుపురం, జానపహాడ్‌లో మూడు కంపెనీలకు సైడింగ్‌లున్నాయి. గుంటూరులో ఒక కాన్‌కోర్ సైడింగ్ ఉన్నది. దీనికి అదనంగా నాగిరెడ్డిపల్లిలో ప్రైవేటు ఫ్రైట్ టెర్మినల్స్ కూడా ఉన్నాయి. డివిజన్ పరిధిలో 75 స్టేషన్లు ఉన్నాయి. వీటిల్లో ఏ1 కేటిగిరీలో గుంటూరు, బీ కేటిగిరీలో నంద్యాల, నల్గొండ ఉన్నాయి. మరో 13 డీ కేటిగిరీలో, 43 ఈ, 13 ఎఫ్, నాన్ ఆపరేషనల్ నాలుగు స్టేషన్లు ఉన్నాయి. ప్రస్తుతానికి గుంటూరు - కృష్ణాకెనాల్, గుంటూరు - తెనాలి డబ్లింగ్ పూర్తి అయ్యాయి. గుంటూరు - నంద్యాల సెక్షన్ దాదాపుగా పూర్తి కావొచ్చింది. నల్లపాడు- బీబీనగర్ డబ్లింగ్ పనులు ప్రారంభమయ్యాయి. 96 శాతం రైలు మార్గాలు విద్యుద్దీకరణ జరిగాయి. రైళ్ల రాకపోకలు అధికంగా ఉండే డివిజన్లలో గుంటూరు రైల్వే డివిజన్ ఒకటి. కాగా గుంటూరు నుంచి బయలుదేరడం, వేరే ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి ఆగిపోవడం, దూరప్రాంతాల నుంచి గుంటూరు మీదగా రాకపోకలు సాగించే రెగ్యులర్, వీక్లీ, బైవీక్లీ, ట్రైవీక్లీ కలుపుకుని 200లకు పైగానే ఉన్నాయి.

మూల్యాంకనంపై మల్లగుల్లాలు

- నరసరావుపేటలో ఏర్పాటుకు భవనాలు ఏవీ
- గుంటూరుకు మార్చాలన్న నిర్ణయంపై వ్యతిరేకత

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేటలో ఇంటర్ పరీక్షల మూల్యాంకన కేంద్రం ఏర్పాటుపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. జిల్లా ఏర్పాటు అనంతరం గత ఏడాది నరసరావుపేటలో కేంద్రం నిర్వహించారు. ఈ ఏడాది గుంటూరుకు మార్చాలని బోర్డు ఉన్నతాధికారులు నిర్ణయించారు. అయితే దీనిపై తీవ్ర వ్యతిరేకతవ్యక్తమవుతుంది. ఈ నేపథ్యంలో నరసరావుపేటలో కేంద్రం ఏర్పాటు తప్పనిసరిగా మారింది. అయితే బుధవారం రాత్రి వరకు భవనాలు లభించలేదు. నరసరావుపేటలో గత ఏడాది పీఎన్‌సీ కొత్తరఘురామయ్య కళాశాలలో మూల్యాంకన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ కళాశాల భవనాల కొరత ఉండటంతో రాష్ట్రవ్యాప్తంగా మన్యం, పల్నాడు జిల్లాల్లో మూల్యాంకన కేంద్రాలను ఇంటర్ బోర్డు రద్దు చేసింది. నరసరావుపేట కేంద్రాన్ని గుంటూరుకు మార్చుతూ బోర్డు నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో అధ్యాపకులు నరసరావుపేటలో కేంద్రం నిర్వహించాలన్న డిమాండ్‌ను తెరపైకి తీసుకొచ్చారు. కొందరు అధ్యాపకులు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలను కలసి నరసరావుపేటలో కేంద్రాన్ని కొనసాగించాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎంపీ ఈ ఏడాది కూడా వ్యాల్యూషన్ కేంద్రాన్ని నరసరావుపేటలో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఎస్‌బీటీఎవీఆర్ ప్రభుత్వ కళాశాల భవనాలను బోర్డు అధికారులు పరిశీలించారు. అయితే ఇక్కడ టాయిలెట్ సౌకర్యం లేదని, భవనాలు కూడా అనుకూలంగా లేవని అధికారులు నిర్ధారించారు. దీంతో ఎస్ఎస్ఎన్ కళాశాల, గత ఏడాది కేంద్రం ఏర్పాటు చేసిన కేఆర్ కళాశాలను పరిశీలించారు. కేఆర్ కళాశాలలోని డీఐఈవో కార్యాలయ అద్దె బకాయి సుమారు రూ1.20 లక్షలు చెల్లించాలి. ఆ అద్దెతో పాటు మూల్యాంకన కేంద్ర నిర్వహణకు కూడా అద్దె చెల్లించాలని కోరుతున్నట్లు సదరు అధికారులు తెలిపారు. గత ఏడాది కేవలం విద్యుత్ బిల్లులు మాత్రమే చెల్లించారు. దీంతో ఇక్కడ కేంద్రం ఏర్పాటు సందిగ్ధంలో పడింది. అద్దె



ఎస్‌బీటీ ఎస్‌వీసీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పర్యటిస్తున్న అధికారులు

చెల్లించేందుకు బోర్డు అంగీకరిస్తే ఈ భవనాలు ఖరారయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఎమ్మెల్సీ ఎన్నిక అవసరాల కోసం వినియోగించే అవకాశం ఉందంటున్నారు. మార్చి ఒకటి నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అదే రోజు నుంచి జవాబుపత్రాలు కేటాయించిన కేంద్రానికి వస్తాయి. వీటిని భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూంను ముందుగానే ఏర్పాటు చేయాల్సి ఉంది. దాదాపు 2.50 లక్షల జవాబు పత్రాలు వస్తాయని అంచనా. ఇందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాలి. 500 మందికి పైగా పేపర్లు దిద్దేందుకు అధ్యాపకులు హాజరవు తారు. వీరికి అవసరమైన వసతులు కల్పించాలి. పీఎన్‌సీ, ఎస్ఎస్ఎన్ కళాశాలలో వసతులు ఉన్నాయి. ఈ రెండింటిలో ఒక కళాశాల వారు జవాబు పత్రాల స్ట్రాంగ్ రూం నిర్వహణ తమకే అప్పగించాలన్న డిమాండ్ చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. స్ట్రాంగ్ రూం నిర్వహణ ఇంటర్ బోర్డు అధికారుల చేతిలోనే ఉండాలి. అయితే అనువైన భవనాలు లభించని పక్షంలో గుంటూరుకు కేంద్రాన్ని తరలించే అవకాశాలను బోర్డు అధికారులు పరిశీలిస్తున్నారు.

ఉమ్మడి పరిశోధనలకు ఒప్పందం



ఒప్పంద పత్రాలను చూపిస్తున్న వీవీఐటీ, చెన్నై కళాశాలల ప్రతినిధులు

పెదకాకాని, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ సాంకేతిక అధ్యాపకుల శిక్షణ, పరిశోధన సంస్థ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్, చెన్నై), వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మధ్య అధ్యాపకులు, విద్యార్థులలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడం, సాంకేతిక విద్యా, పరిశోధనా, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించేలా అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ బుధవారం తెలిపారు. ఎన్.ఐ.టి.టి.టి.ఆర్ చెన్నైలో ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఉషా నటేషన్, వీవీఐటీ డైరెక్టర్ డాక్టర్ రావెల నవీన్ మధ్య ఈ ఒప్పంద మార్పిడి జరిగిందని తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా ఉమ్మడి పరిశోధనా ప్రాజెక్టులు, సాంకేతిక విద్యా నాణ్యత పెంపు, ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్ వంటి అంశాలలో సహకారం అందుతుందని వివరించారు. పాఠ్యాంశ అభివృద్ధి, ప్రశ్నపత్రం సెట్టింగ్, నిరంతర మూల్యాంకన పద్ధతులు, విద్యా ఆడిట్, అక్రిడిటేషన్ రంగాలలో శిక్షణ ఉంటుందన్నారు. రెండు సంస్థలు కలిసి దేశవ్యాప్తంగా ఉన్న సాంకేతిక అధ్యాపకులకు అభివృద్ధి చెందుతున్న సాంకేతిక అంశాలపై శిక్షణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 23 మందికి ఉద్యోగాలు

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో రినెక్స్ టెక్నాలజీ ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు కళాశాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాంపస్ ఇంటర్వ్యూలో 23 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని వివరించారు. ఎంపికైన వారికి ఇంటర్న్‌షిప్ సమయంలో రూ.25 వేలు స్టైపెండ్, ప్రతిభ ఆధారంగా రూ.10 లక్షల వార్షిక వేతనం అందిస్తారని తెలిపారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్, కె.మద్దినేని తదితరులు అభినందించారు.

మద్యం దుకాణాల దరఖాస్తులకు గడువు పొడిగింపు

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గుంటూరు, పల్నాడు జిల్లాల్లో గౌడ, గౌడ్ సంఘీయుల మద్యం దుకాణాలకు దరఖాస్తు గడువు ఈ నెల 8వ తేదీ వరకు పొడిగించినట్లు గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాసులు బుధవారం తెలిపారు. గత నెల 27న రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ఈ నెల 5వ తేదీతో మద్యం షాపుల దరఖాస్తు గడువు ముగిసిందన్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తుల ప్రక్రియను ఈ నెల 8వ తేదీ వరకు పొడిగించిందని తెలిపారు. గుంటూరు జిల్లాలో 13, పల్నాడు జిల్లాలో 13 చొప్పున రెండు జిల్లాలలో 26 మద్యం షాపులకు టెండర్లు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 10న దుకాణాలకు లాటరీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

చేయి తడపాల్సిందే!

- కమీషన్ల కోసం పెండింగ్‌లో ఫైళ్లు
- మీటింగ్ బిల్లుల పేరుతో అధికారుల ఈటింగ్
- ఇదీ జడ్పీలోని అధికారుల అవినీతి తీరు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గతేడాది అక్టోబర్ 3న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఏర్పాట్లకు సంబంధించిన బిల్లులు లక్షల్లో ఉన్నాయి. ఇంతవరకు ఒక్క రూపాయి చెల్లింపు జరగలేదు. కారణం జిల్లా పరిషత్‌లో నిధుల్లేక కాదు. కమీషన్ల వ్యవహారం కొలిక్కి కాక. ఆ బిల్లులు చెల్లించాలంటే గట్టిగా నలుగురు, ఐదుగురికి చేతులు తడపాలి. ఆ పని కాలేదు కనుక మూడు నెలలు దాటినా బిల్లుల చెల్లింపు వ్యవహారం జడ్పీ చుట్టూ గింగిరాలు తిరుగుతుంది. ఈ ఒక్క బిల్లులే కాదు. జడ్పీలో ఏ బిల్లుకు మోక్షం కలగాలన్నా చివరిగా మనీ మంత్రం పడాల్సిందే.

మీటింగ్ బిల్లుల పేరిట అవినీతి

గుంటూరు జిల్లా పరిషత్‌లో సర్వసభ్య సమావేశాలు పేరిట భారీ అవినీతి జరుగుతుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి మూడు నెలలకొకసారి జరిగే సర్వసభ్య సమావేశం పేరుతో రూ.3 లక్షల నుంచి రూ. 6 లక్షల వరకు జడ్పీ నిధులను డ్రా చేస్తున్నారు. గతంలో మరింత ఎక్కువ మొత్తంలో డ్రా చేసేవారు. సర్వసభ్య సమావేశం పేరుతో డ్రా చేసే నిధుల్లో ఎక్కువ భాగం ముఖ్యుల జేబుల్లోకి వెళ్లాయన్న ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో నాలుగు స్థాయిల్లో ఈ నిధులకు సంబంధించిన పంపకాలు జరిగేవి. ఆ బిల్లుల వ్యవహారం చూసే కీలకమైన ఉద్యోగి చేతుల మీదుగా అందరికీ కవర్లు అందేవన్న ప్రచారం ఉంది. ఇన్ని స్థాయిల్లో పంపకాలు జరగాలి కనుక సర్వసభ్య సమావేశం బిల్లు కూడా భారీగా పెరిగిపోయేది. ఇప్పుడు కూడా తూచా తప్పకుండా అదే జరుగుతోంది.

అన్నిస్థాయిల్లో అదే పరిస్థితి..

జిల్లా పరిషత్‌లోని కొందరిపై తీవ్రమైన ఆరోపణలు వస్తున్నాయి. ఎక్కడికి వెళ్లినా ఎంతో కొంత ఇవ్వనిదే పని కావడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కనీసం రూ.25 వేలు ఇవ్వాల్సి వస్తుందని ఒక అధికారి వెల్లడించారు. ఇవ్వకపోతే ఇబ్బందులు వస్తాయన్న ఆలోచనతో ముట్టజెప్పాల్సి వస్తుందన్నారు. ప్రస్తుతం జిల్లా పరిషత్‌లో కొన్ని వందల ఫైళ్లు నిలిచిపోయాయి. అవి ఏ స్థాయిలో ఉన్నాయో కూడా చెప్పటం కష్టమేనని కొందరు అధికారులు చెబుతున్నారు. ఇవన్నీ ముడుపుల శాతం తేలక ఆగిపోయినవేనని చెబుతున్నారు. ఆ విషయం తేలకపోతే ఫైల్ ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. సాధారణంగా బిల్లు చెల్లింపు కోసం కాంట్రాక్టర్లు ఎక్కడో ఒకచోట కొంతవరకు ముట్టచెబుతారు. ఇక్కడ మాత్రం అన్ని చోట్లా ఇవ్వాల్సి వస్తుందని ఒక కాంట్రాక్టర్ చెప్పారు.

48 కేంద్రాల్లో ఇంటర్మీడియట్ పరీక్షలు

- కలెక్టర్ పి.అరుణ్ బాబు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిణి నీలావతి దేవి

నరసరావుపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్ పరీక్షలకు 48 కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ పి.అరుణ్ బాబు తెలిపారు. కలెక్టరేట్‌లో ఇంటర్ పరీక్షల నిర్వహణపై జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 32,434 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు చెప్పారు. వీరిలో 17,905 మంది మొదటి సంవత్సరం, 14,529 మంది ద్వితీయ సంవత్సర విద్యార్థులు ఉన్నారని వివరించారు. మరో 2117 మంది విద్యార్థులు ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షలు రాయనున్నారని తెలిపారు. 9 కేంద్రాల్లో ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఒక హెల్త్‌అసిస్టెంట్‌ను అందుబాటులో ఉంచాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే ఏ పరీక్షా కేంద్రానికి అయినా చేరుకునే విధంగా కీలక ప్రాంతాల్లో మెడికల్ వ్యాన్లను సిద్ధంగా ఉంచాలని వైద్యాధికారులను ఆదేశించారు. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా బస్సులు నిర్వహించాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. సమావేశంలో డీఆర్వో మురళి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిణి నీలావతి దేవి, డీఈవో చంద్రకళ, డీఎంహెచ్ఓ రవి, మున్సిపల్ కమిషనర్ జస్వంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం

ఇంటర్ ఒకేషనల్ కోర్సుల విద్యార్థులకు బుధవారం ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. 11 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ఉదయం జరిగిన ప్రాక్టికల్ పరీక్షలకు 617 మంది హాజరు కాగా 89 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో నీలావతి దేవి తెలిపారు. సాయంత్రం 10 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు 502 మంది హాజరు కాగా 39 మంది గైర్హాజరయ్యారని చెప్పారు.

ఆలపాటిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో గుంటూరు, కృష్ణా ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కోరారు. బుధవారం అమరావతిలోని ఏవీఆర్ కన్వెన్షన్ హాలులో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గ స్థాయి ఉమ్మడి కూటమి నాయకులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మంత్రి గొట్టిపాటి ముఖ్యఅతిథిగా పాల్గొని ఎన్నికల నిర్వహణపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అధ్యక్షత వహించారు. మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు అధ్వానంగా మారాయని, కూటమి అధికారంలోకి వచ్చిన 8 నెలల పాలనలో రాష్ట్ర అభివృద్ధితోపాటు సంక్షేమం పరుగులు పెట్టేలా ముఖ్యమంత్రి పాలన చేస్తున్నారన్నారు. త్వరలో నిరుద్యోగ భృతి, తల్లికి వందనం పథకాలు అమల్లోకి రానున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ పెదకూరపాడు నియోజకవర్గంలో పట్టభద్రుల ఓట్లు సుమారు 7.5వేలు ఉన్నాయని, అత్యధిక శాతం కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటికి పోలైయ్యేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రతి 30 మంది ఓటర్లకు ఒకరిని పర్యవేక్షకునిగా ఉంచామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు నల్లపాటి రాము, కేకే చౌదరి, గుంటూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్, జీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ఎన్‌వీవీ వరప్రసాద్, ఎంపీపీ ఎం.హనుమంతరావు, ఐదు మండలాల టీడీపీ అధ్యక్షులు, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

సీఎంను విమర్శించే అర్హత జగన్‌కు లేదు

- ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సీఎం నారా చంద్రబాబు నాయుడుని విమర్శించే అర్హత జగన్‌కు లేదని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. జగన్ మాట్లాడిన తీరుపై స్థానిక టీడీపీ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జీవీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు 11 సీట్లు ఇచ్చారనీ, కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదనీ, రానున్న రోజుల్లో ఆ ఎమ్మెల్యే పదవి కూడా కోల్పోయి, సీబీఐ కేసుల్లో శిక్ష పడటం ఖాయమని అన్నారు. జగన్ అవినీతి కేసుల్లో 16 నెలలు జైలులో ఉన్నా, రాజశేఖరరెడ్డిపై అభిమానంతో గెలిపించారని, రాష్ట్రానికి సీఎంగా ఉండి నట్టేట ముంచారని విమర్శించారు. ఇసుక, మద్యం గురించి మాట్లాడే అర్హత లేదనీ, ప్రభుత్వ మద్యం షాపులు పెట్టి గ్రామాల్లో బెల్టుషాపుల తెరిపించి లక్షల కోట్లు దోచుకున్న మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఎన్డీఏ కూటమికి ప్రజలు జేజేలు పలుకుతున్నారని, గాడితప్పిన వ్యవస్థను సీఎం చంద్రబాబు నాయుడు గాడిలో పెట్టారని, జగన్ ఆత్మ విమర్శ చేసుకుంటే మంచిదని సూచించారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, పీవీ సురేష్, షమీమ్, గుంటూరు సాంబశివరావు పాల్గొన్నారు.

సహజ న్యాయ సూత్రాలకు అనుగుణంగా రీసర్వే

పెదకాకాని, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): చట్టపరిధికి లోబడి సహజ న్యాయ సూత్రాలను అనుసరిస్తూ రీసర్వే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సీసీఎల్ఏ చీఫ్ కమిషనర్ జి.జయలక్ష్మి స్పష్టం చేశారు. గతంలో జరిగిన తప్పిదాలను అధిగమిస్తూ సజావుగా రీసర్వే పూర్తి చేయాలని సూచించారు. బుధవారం గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లకు శిక్షణ, సమీక్ష కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ రీసర్వే డీటీలకు విస్తృత అధికారాలు కల్పించామనీ, వాటిని సమస్యల పరిష్కారానికి వినియోగించాలన్నారు. రెవెన్యూ రికార్డులలో నెలకొన్న లోపాలను అధిగమించి భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా స్పష్టమైన రికార్డుల రూపకల్పనకు మార్గం సుగమం చేయాలన్నారు. సర్వే సెటిల్మెంట్, భూమి రికార్డుల సంచాలకులు డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, సర్వే సెటిల్మెంట్, భూమి రికార్డుల అదనపు సంచాలకులు గోవిందరావు మాట్లాడుతూ సమస్యలను లోతుగా అవగాహన చేసుకుని పరిష్కారం చూపాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లు దాదాపు 550 మంది సదస్సుకు హాజరయ్యారు. గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ తేజ, కేంద్ర కార్యాలయం ఉప సంచాలకులు డీఎల్ బీఎల్ కుమార్, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు కేజియా కుమారి, సహాయ సంచాలకులు ఎంవీ రంగప్రసాద్, ప్రశాంతి, ఏవీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల మూల్యాంకనంలో నిబంధనలకు నీళ్లు

నరసరావుపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూ డిగ్రీ పరీక్షల మూల్యాంకనంలో నిబంధనలు పాటించడం లేదు. మూల్యాంకనంకు నిర్ణీత సమయం కేటాయించడం లేదని తెలిసింది. దీంతో అధ్యాపకులు ఇబ్బందులకు గురవుతున్నట్లు సమాచారం. యూజీసీ ప్రవేశపెట్టిన ఆనర్స్ విధానం కారణంగా పాఠ్యాంశాలు బోధించని అధ్యాపకులు వారికి సంబంధంలేని జవాబు పత్రాలను దిద్దుతున్నట్టు ప్రచారం. మూల్యాంకనంకు రాని అధ్యాపకుని ఐడీ నంబరును ఉపయోగించి బోధనేతర సిబ్బంది చేత జవాబు పత్రాలు దిద్దుస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. నరసరావుపేటలోని ఒక ప్రైవేటు కళాశాలలో ఏర్పాటు చేసిన మూల్యాంకన కేంద్రంపై పలు ఆరోపణలున్నాయి. డిగ్రీ ఆనర్స్ విధానం వలన ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఒక్కొక్క సబ్జెక్టును ఇద్దరు, ముగ్గురు వేర్వేరు సబ్జెక్ట్ అధ్యాపకులు బోధించాలి. దీంతో అయా సబ్జెక్టుల పేపర్ జవాబు పత్రాలను ఏఏ అధ్యాపకులు మూల్యాంకనం చేయాలనే దానిపై వర్సిటీ పరీక్షల విభాగం స్పష్టమైన విధానాన్ని ప్రకటించలేదు. ఈ నేపథ్యంలో మూల్యాంకన కేంద్రం నిర్వాహకులు ఆయా పత్రాల మూల్యాంకనం చేసేందుకు కొందరికే ప్రాధాన్యత ఇస్తుండటంతో ఆ పాఠ్యాంశం బోధించిన అధ్యాపకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మల్టీ డిసిప్లీనరీ పేపర్, స్కిల్ పేపర్లను సబ్జెక్ అధ్యాపకులతో సంబంధం లేకుండా మూల్యాంకన చేయిస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. మూల్యాంకన కేంద్రంలో లోపాల ప్రభావం విద్యార్థుల మార్కులపై పడుతుందన్న అభిప్రాయం అధ్యాపకుల నుంచి వ్యక్తమవుతోంది. మూల్యాంకనం 5 నుంచి 6 గంటల పాటు జరగాలి. ఒక్కొక్క అధ్యాపకుడు రోజుకు 30 జవాబు పత్రాలను దిద్దాలి. ఇక్కడి కేంద్రంలో మూల్యాంకనకు కేవలం మూడు గంటలు ఇస్తున్నట్లు సమాచారం. సాయంత్రం 4.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు సమయం ఇస్తునట్టు పలువురు అధ్యాపకులు చెబుతున్నారు. మూల్యాంకనకు హాజరు కాని అధ్యాపకుల పేరు మీదుగా బిల్లులు చెల్లింపులు జరుగుతున్నాయన్న ఆరోపణలున్నాయి. యూనివర్సిటీ పరీక్షల విభాగం కో ఆర్డినేటర్ కృష్ణారావును వివరణ అడగ్గా కేంద్రాన్ని తనిఖీ చేస్తామని, తమ విచారణలో అవకతవకలు ఉన్నట్టు వెల్లడైతే తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వర్సిటీలో స్కిల్ ఎకో సిస్టం అభివృద్ధికి చర్యలు



వర్సిటీలో పలు విభాగాలను పరిశీలిస్తున్న ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి వాణి ప్రసాద్

పెదకాకాని, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మరో నైపుణ్య శిక్షణ కేంద్రానికి వేదిక కానుంది. విద్యార్థులు, యువతకు మెరుగైన నైపుణ్యాలు నేర్పించి వారిని ఉపాధి మార్గాల వైపు పయనించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ విశ్వవిద్యాలయంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. లేబర్, బాయిలర్స్ అండ్ ఇన్సూరెన్స్, మెడికల్ సర్వీసెస్, ప్రత్యేక కార్యదర్శి ఎ.వాణి ప్రసాద్, ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఎస్ఎస్‌డీసీ) ఎండీ, సీఈవో గణేష్ కుమార్‌ల బృందం బుధవారం విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ గంగాధరరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలంతో కలిసి దూరవిద్య కేంద్రాన్ని పరిశీలించారు. స్కిల్ ఓరియంటేషన్, స్కిల్ ఎకో సిస్టమ్ అభివృద్ధి, అందుకు అవసరమైన వసతులు గుర్తించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, ఏపీఎస్ఎస్‌డీసీలు సంయుక్తంగా చేపట్టాల్సిన పలు స్కిల్ ఇనిషియేటివ్స్‌పై చర్చించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ వీసీ గంగాధరరావు మాట్లాడుతూ వర్సిటీలో స్కిల్ ఎకో సిస్టం ఏర్పాటుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎస్ఎస్‌డిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దినేష్, దూర విద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

8న నవోదయ ప్రవేశానికి ఎంపిక పరీక్ష

చిలకలూరిపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయం 9, 11 తరగతులలో (లేటరల్ ఎంట్రీ) ప్రవేశానికి ఎంపిక పరీక్ష ఈ నెల 8న నిర్వహిస్తున్నట్టు మద్దిరాల జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ ఎన్. నరసింహారావు బుధవారం తెలిపారు. మొత్తం 7 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ జరుగుతుందన్నారు. 9వ తరగతి పరీక్షకు 1,372 మంది, 11వ తరగతి పరీక్షకు 695 మంది దరఖాస్తు చేసినట్టు వివరించారు. 9వ తరగతి పరీక్ష చిలకలూరిపేటలోని చౌదరయ్య స్కూలు, శారద హైస్కూల్, ఆర్‌వీఎస్‌సీవీఎస్ హైస్కూల్, నరసరావుపేటలోని మున్సిపల్ బాలుర హైస్కూల్, శంకరభారతిపురం జడ్పీ హైస్కూల్‌లలో జరుగుతాయని తెలిపారు. 11వ తరగతి పరీక్ష మద్దిరాల జవహర్ నవోదయ విద్యాలయం, చిలకలూరిపేట ఏఎంజీ హైస్కూలులో జరుగుతాయని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డులను ఆన్‌లైన్‌లో నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చునన్నారు. వివరాలకు 90143 07677 నంబరుకు సంప్రదించాలని కోరారు.

గ్రానైట్ లారీ స్వాధీనం



అధికారులు స్వాధీనం చేసుకున్న గ్రానైట్ లారీ

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి అనుమతి లేకుండా గ్రానైట్ రాయిని తరలిస్తున్న లారీని గుంటూరు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ఎస్పీ డి.సూర్య శ్రావణ్ కుమార్ ఆదేశాల మేరకు మంగళగిరి కాజా టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా గ్రానైట్ తరలిస్తున్న లారీ తారసపడింది. గ్రానైట్ తరలింపునకు అవసరమైన పత్రాలను చూపించకపోవడంతో అక్రమంగా తరలిస్తున్నట్లు నిర్ధారించారు. లారీని మంగళగిరి పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు సీఐ కె.చంద్రశేఖర్ తెలిపారు.

గుర్తుతెలియని మహిళ మృతి

మాచర్లటౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మాచర్ల పట్టణంలో బుధవారం జరిగింది. గత నెల 27న సుమారు 50 ఏళ్ల వయసున్న ఓ మహిళ పట్టణంలోని చంద్రవంక బ్రిడ్జి వద్ద అపస్మారక స్థితిలో ఉండడాన్ని గుర్తించి పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. అనంతరం ఆమెను వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం నరసరావుపేటకు తరలించారు. ఆమె అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 1న మృతి చెందింది. మృతురాలు తెలుపురంగుపై నలుగురంగు డిజైన్ల చీర, ఆకుపచ్చ జాకెట్ ధరించి ఉంది. మృతురాలు వివరాలు తెలిసిన వారు పట్టణ పోలీస్‌స్టేషన్లో సంప్రదించాలని పట్టణ ఎస్ఐ సంధ్యారాణి తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 548.50 అడుగులు ఉంది. ఇది 206.48 టీఎంసీలకు సమానం. ఔట్‌ఫ్లో వాటర్‌గా 47,705 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	123,132,142
చికెన్ విత్ స్కిన్	230.00
చికెన్ స్కిన్ లెస్	240.00

1,27,321 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,21,569 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,27,321 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 72,162 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	9000	13700	334	9500	11500
నెంబరు. 5	10000	13000	నెంబరు.5	--	--
273	10500	12000	273	--	--
341	10000	15000	341	--	--
4884	9500	12000	4884	--	--
సూపర్ 10	10500	14000	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15500	తేజ	11000	14700
బ్యాడిగి	10000	12500	బ్యాడిగి	9000	10000
దేవనూరు డీలక్స్	10000	13500	దేవనూరు డీలక్స్	--	--
తెల్లకాయలు	4000	7500	తెల్లకాయలు	4000	7500

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

దండివాగు లిఫ్ట్‌కు యుద్ధప్రాతిపదికన విద్యుత్ మరమ్మతులు

● మూడువేల ఎకరాలకు అందుబాటులోకి సాగునీరు


దండివాగు లిఫ్ట్ నుంచి ప్రవహిస్తున్న సాగు నీరు

దాచేపల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మూడువేల ఎకరాలకు సాగు నీరందిస్తున్న దండివాగు లిఫ్ట్ పథకం విద్యుత్‌వైర్లు తగలబడి మరమ్మతులకు గురైంది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్ళటంతో తక్షణమే సమస్యను పరిష్కరించారు. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం పొందుగుల గ్రామ శివారు శ్రీనివాసపురం సమీపంలో దండివాగు లిఫ్ట్ ఇరిగేషన్ 20 సంవత్సరాల క్రితం నిర్మాణం చేశారు. అప్పటినుంచి నేటివరకు దండివాగు లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ద్వారా పొందుగుల, రామాపురం, శ్రీనగర్, శ్రీనివాసపురం గ్రామాల్లో పంటల ఆరు తడులకు సాగు నీరందుతోంది. కొద్దిరోజుల క్రితం విద్యుత్‌తీగలు దగ్ధమయ్యాయి. ఈ విషయాన్ని నాగార్జున సాగర్ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పులుకూరి కాంతారావు, రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి వేముల వినోద్‌రెడ్డి ఎమ్మెల్యే యరపతినేని దృష్టికి తీసుకువెళ్ళారు. ఈ విషయంపై విద్యుత్‌శాఖ రాష్ట్ర అధికారులతో మాట్లాడి రోజుల వ్యవధిలోనే మరమ్మతులను పూర్తిచేయటం, పంటలకు సాగునీరు అందించటం జరిగింది. దండివాగు లిఫ్ట్ ఇరిగేషన్ కమిటీ ఛైర్మన్ వేముల వెంకటరెడ్డి, మేజరు వైస్ ఛైర్మన్ ఆకూరి వెంకటరెడ్డి తదితరులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

రేపు శ్రీలక్ష్మీనరసింహా స్వామి కల్యాణ మహోత్సవం

మాచవరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోర్జంపాడు గ్రామంలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి 69వ కల్యాణ మహోత్సవం ఈనెల 7వ తేదీన నిర్వహించనున్నట్టు దేవాలయ కమిటీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తేదీన దశావతార వేషధారణ కోలాటాలతో సేవా కార్యక్రమం, మాలధారణ స్వాములచే ఊరేగింపు జరుగుతుంది. 7న శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం జరుగుతుందని తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జడ్పీ హైస్కూల్లో జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పౌరాణిక, సాంఘిక, కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

8 నుంచి జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

మండలంలోని మోర్జంపాడు గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి సేవా సంఘం ఆధ్వర్యంలో 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జాతీయస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు కమిటీ బుధవారం తెలిపింది. జత పండ్లు, నాలుగు పండ్లు, పాల పండ్లు, సేద్య విభాగం, జూనియర్, సీనియర్ సైజు విభాగాల్లో ఎడ్ల బలప్రదర్శన పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో పాల్గొనదలచినవారు దగ్గు లింగారెడ్డి, గడిపూడి సైదులుకు డిపాజిట్ చెల్లించి రసీదు పొందాలని కమిటీ వారు కోరారు.

పొలాలను పరిశీలించిన నాబార్డ్ డీడీఎం


పొలాలను పరిశీలిస్తున్న నాబార్డ్ డీడీఎం శరత్‌బాబు

వెల్దుర్తి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అసిస్ట్ సంస్థ అమలుచేస్తున్న టీడీఎఫ్ ప్రాజెక్టులో భాగంగా మండలంలోని శిరిగిరిపాడులో రైతులు మా తోట పేరిట సాగు చేయనున్న పండ్ల తోటలను బుధవారం నాబార్డ్ జిల్లా డీడీఎం శరత్‌బాబు పరిశీలించారు. వేసవిలో మొక్కలను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. పండ్లతోటలకు నీటిని అందించేందుకు వాటర్ ట్యాంకర్లు ఏర్పాటుచేయనున్నట్లు చెప్పారు. రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటుపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలోని ఏరియా కార్యాలయాన్ని సందర్శించి నాలుగు నెలలపాటు కుట్టుమిషన్ శిక్షణ తీసుకున్న 20మంది మహిళలకు ఉచితంగా మిషన్లు అందజేశారు. కార్యక్రమంలో అసిస్ట్ సంస్థ డిప్యూటి డైరెక్టర్ పి.రవిబాబు, టీడీపీ నేత కళ్లం రామాంజిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 33.89 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. మూడు వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా దిగువ కృష్ణకు విడుదల అవుతున్నాయి.

దేవేంద్రయ్య చిత్రపటానికి వైవీ ఆంజనేయులు నివాళి


దేవేంద్రయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైవీ

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) మండలంలోని ధరణికోటకు చెందిన కోదండరామ ఎత్తిపోతల పథకం మాజీ ఛైర్మన్, టీడీపీ సీనియర్ నాయకుడు వట్టికుంట దేవేంద్రయ్య పెద్దకర్మ సందర్భంగా చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు దేవేంద్రయ్య చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ధరణికోటలోని దేవేంద్రయ్య గృహాన్ని సందర్శించి కుటుంబసభ్యులు పరామర్శించారు. వైవీతో పాటు సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు, పలువురు టీడీపీ నాయకులు దేవేంద్రయ్యకు నివాళులు అర్పించారు.

అందరికి అందుబాటులో ఉంటాను: తహసీల్దార్

రెంటచింతల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండల ప్రజలందరికి అందుబాటులో ఉంటానని, అర్జీలను వెంటనే పరిష్కరిస్తానని తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఎం అర్జున్‌నాయక్ అన్నారు. బుధవారం టీడీపీ మండల నేతలు తహసీల్దార్‌ను సత్కరించారు. సన్మానించిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, మండ లపరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గొంటు సుమంత్‌రెడ్డి, మంచికల్లు సర్పంచ్ గోగుల పుల్లారెడ్డి, బోడపాటి రామకృష్ణ, మూలి రాయపరెడ్డి, ప్రభురాజ్, లింగయ్య తదితరులున్నారు.

తప్పులు లేని రికార్డుల కోసమే రీసర్వే

తప్పులు లేని రికార్డులు, వివాదాలు లేని గ్రామాల కోసమే రాష్ట్ర ప్రభుత్వం భూముల రీసర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని తహసీల్దార్ అర్జున్‌నాయక్ అన్నారు. బుధవారం మల్లవరంలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన సర్వే నెం.32/3లో 3.93 ఎకరాల భూమిని రీసర్వే చేశారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఈవో గాదె రామిరెడ్డి, వీఆర్వో పాపారావు తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లి జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎల్ఐసీ డీవో బిక్షాలు నాయక్

రెంటచింతల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు పల్నాటి గాంధీగా పేరుగాంచిన నాళం మట్టపల్లి జీవిత చరిత్రను పాఠ్యాంశంగా రూపొందించాలని ఎల్ఐసీ డీవో బిక్షాలునాయక్ కోరారు. బుధవారం రెంటచింతలలో మట్టపల్లి 64వ వర్ధంతి నిర్వహించారు. తొలుత ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆరుగురు విద్యార్థులకు రూ.4 వేల నగదును అందజేశారు. పదోతరగతి చదివే 28 మంది విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు, జామెట్రీ బాక్స్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త నాళం నరసింహారావు,ప్రిన్సిపాల్ మోహన్, ఏచూరి సైదయ్య, గొంటు ఆదిరెడ్డి, వాసవీ ఆలయ ఛైర్మన్ కట్టమూరి వెంకట నాగేశ్వరరావు, కె.బ్రహ్మం, విద్యావేత్త శ్రీనివాసరావు తదితరులున్నారు.

విచారణ



నాలుగు సంవత్సరాల క్రితం సుగాలీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల కమిటీ ఎన్నికపై ఆ పాఠశాల సోషల్ ఉపాధ్యాయుడు రౌతు శ్రీనివాసరెడ్డి చేసిన ఫిర్యాదుపై బుధవారం విద్యాశాఖ ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి విచారణ జరిపారు. ఆ సమయంలో పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులను ఆయన విచారించారు. ఆయనతో పాటు ఎంఈవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. - సత్తెనపల్లి

తాగునీటి పైపులైనుకు లీకులు


బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ ఎదురు రహదారిపై లీకేజీ


గురజాల-మాచర్ల రహదారిపై లీకేజీ నీరు


లక్ష్మీ టాకీస్ సెంటర్లో వైన్‌షాపు ఎదురు లీకేజీ

గురజాలటౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గురజాల పట్టణానికి మంచినీటిని అందించే పైపులైను లీక్ అవుతోంది. ఏళ్ల తరబడి ఈ సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. దూబచెరువు నుంచి పట్టణానికి మంచినీటిని అందిస్తున్నారు. పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురు, బుడగజంగాల కాలనీ, లక్ష్మీటాకీస్ సెంటర్, పెట్రోల్ బంకు తదితర ప్రాంతాల్లో పైపులైను లీకేజీ అవుతోంది. లీకేజీలతో సరైన సమయంలో నీరు అందక పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గురజాల-మాచర్ల ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోతోంది. 2016లో గురజాల పట్టణంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యాన టీడీపీ ప్రభుత్వం రోడ్డు విస్తరణ పనులు చేపట్టి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. గత వైసీపీ పాలనలో నీటి లీకేజీలు ఏర్పడ్డాయి. వైసీపీ ప్రభుత్వం తమ పాలనలో పట్టించుకోకపోవడంతో సమస్య పెద్దదిగా మారింది. దీంతో గత పాలకుల తీరుపై ప్రజలు విమర్శలకు దిగుతున్నారు.

నేషనల్ హైవే అధికారుల అనుమతి కోరాం : మున్సిపల్ కమిషనర్ శివన్నారాయణ

గతేడాది నవంబర్‌లో లీకేజీ సమస్యల పరిష్కారానికి నేషనల్ హైవే అధికారుల అనుమతి కోరాం. ఇంతవరకు అనుమతి రాలేదు. అనుమతి రాగానే లీకేజీల సమస్యలను పరిష్కరిస్తాం.

ఆలపాటి విజయం కోసం అందరూ కృషి చేయాలి

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్

సత్తెనపల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాదు విజయం కోసం కూటమి నేతలంతా కృషిచేయాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక టీడీపీ ప్రజావేదికలో బుధవారం కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలపై సత్తెనపల్లి, ముప్పాళ్ళ మండలాల కూటమి నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎలినేడి రామస్వామి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి గురించి గ్రామగ్రామాన ప్రజలకు వివరించాలన్నారు. విద్యావంతులు, మేథావులు ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకొనేలా చూడాలన్నారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ జగన్ రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించారన్నారు. సీఎం చంద్రబాబు అనుభవంతో కేంద్రం నుంచి రాష్ట్రాభివృద్ధికి నిధులు వస్తున్నాయన్నారు. రాష్ట్రం ఆర్థికంగా స్వయం సమృద్ధి పొందేందుకు శాసనమండలి ఎన్నికల్లో ఆలపాటిని అత్యధిక ఓట్లతో గెలిపించాలని కోరారు. నియోజకవర్గంలో 9,698 ఓట్లు ఉన్నాయని, 30మంది ఓటర్లకు ఒక బాధ్యుడిని నియమిస్తామన్నారు. ఈ బాధ్యులు ఎంఎల్‌సీ ఎన్నిక పూర్తయ్యేవరకు ఓటర్లను సమన్వయం చేసుకుంటూ సాగాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు తాతా జయప్రకాష్ నారాయణ, వేములకొండ శ్రీనివాస్, నాయకులు మక్కపాటి రామచంద్రరావు, బత్తుల నాగేశ్వరరావు, మన్నవ శారదాదేవి, పూజల వెంకటకోటయ్య, ఆతుకూరి నాగేశ్వరరావు, ఎంవీ చలపతిరావు, కట్టా శంకరరావు, శిరిగిరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఎన్‌టీఆర్, కోడెల విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నిరాశపరిచిన కేంద్ర బడ్జెట్

● ప్రతులను దహనం చేసిన ప్రజాసంఘాల నాయకులు


పిడుగురాళ్లలో బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్ రైతులు, కార్మికులు, వ్యవసాయకార్మికులను తీవ్ర నిరాశకు గురిచేసిందని రైతుసంఘం పల్నాడు జిల్లా ప్రధానకార్యదర్శి యేపూరి గోపాలరావు తెలిపారు. బుధవారం కేంద్రబడ్జెట్‌కు వ్యతిరేకంగా రైతుసంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో పిడుగురాళ్లలోని బ్యాంక్‌సెంటర్‌లో ర్యాలీ నిర్వహించారు. బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి ఇస్తున్న సబ్సిడీలకు కోత విధించి ఆహార మద్దతును ప్రమాదంలో పడవేసిందని ఆరోపించారు. అనంతరం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తెలగపల్లి శ్రీను, దేవళ్ల భూలక్ష్మీ, సంపతి వెంకటకృష్ణ, మద్దిరాల సైదులు, గుంటి నాగేశ్వరరావు, సుజాత, దేవి, అన్నపూర్ణ, రామయ్య, మామిడాల శ్రీను, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

దాచేపల్లిలో...

దాచేపల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్ పేదలకు నిరుపయోగంగా మారిందని సీపీఐ నాయకులు ఆరోపిస్తూ ప్రతులను దహనం చేశారు. బుధవారం నారాయణపురంలోని సీపీఐ కార్యాలయం వద్ద పార్టీ నాయకులు మాట్లాడుతూ విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, సామాజిక సంక్షేమం వంటి అంశాలను విస్మరించినట్టు ఆరోపించారు. ఉపాధి హామీ పథకానికి నిధులు కేటాయించ లేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ గురజాల నియోజకవర్గ కార్యదర్శి మందపాటి రమణారెడ్డి, కొమెర వెంకటరావు, యడ్ల భాస్కరరావు, పత్తిపాటి వెంకట నాగరాజు, గంగావరం వలి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరులో...

క్రోసూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మన రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ పలు ప్రజాసంఘాల నాయకులు బుధవారం క్రోసూరులోని అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద ప్రతులను దహనం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జీ రవిబాబు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులు, రైతులు, నిరుద్యోగుల సంక్షేమానికి బడ్జెట్‌లో కేటాయింపులు జరగలేదన్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు తిమ్మిశెట్టి హనుమంతరావు, రైతు సంఘం జిల్లా నాయకులు రావిళ్ళ వెంకటేశ్వర్లు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు చిలకా ఏసయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఏపూరి వెంకటేశ్వర్లు, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో...

సత్తెనపల్లి రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి తీవ్ర అన్యాయం చేశారని ప్రజాసంఘాల నాయకులు ధ్వజమెత్తారు. వ్యవసాయ రంగానికి తగినంత నిధులు కేటాయించకపోవటాన్ని నిరశిస్తూ మండలంలోని రెంటపాళ్ళలో ఆందోళన నిర్వహించారు. అనంతరం బడ్జెట్ ప్రతులను తగలబెట్టారు. కార్యక్రమంలో కౌలు రైతుసంఘం మండల కార్యదర్శి పెండ్యాల మహేష్, రైతు సంఘం కార్యదర్శి మక్కపాటి నరసింహారావు, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి జే.భరత్, దుగ్గి మీరమ్మ, బొల్లేపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్‌లో వ్యక్తి గల్లంతు


గల్లంతైన బసప్ప(ఫైల్)

నకరికల్లు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్‌లో వ్యక్తి గల్లంతైన ఘటన బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కర్నాటకలోని బీదరుకు చెందిన బసప్ప(40) అనే లారీడ్రైవర్ మండలంలోని శ్రీరాంపురం వద్ద బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్‌లో దుస్తులు ఉతుక్కునేందుకు వచ్చాడు. కాలుజారి కాలువలో పడటంతో నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. చెన్నై నుంచి హైదరాబాద్‌కు లోడుతో వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఎస్ఐ సురేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసు, ఫైర్ సిబ్బంది బసప్ప కోసం గాలింపు చర్యలను చేపట్టారు.

పోలీసు స్టేషన్‌కు చేరిన ముత్తూట్ పంచాయితీ


పోలీసుస్టేషన్‌కు తరలివచ్చిన ముత్తూట్ ఫైనాన్స్ బాధితులు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముత్తూట్‌పై నాన్స్ బాధితులు పలువురు బుధ వారం రాత్రి పట్టణ పోలీసు స్టేషన్‌కు వచ్చి తమకు న్యాయం చేయాలంటూ సీఐ బ్రహ్మయ్యను కోరారు. తాము డబ్బులు చెల్లించినా బంగారం ఇవ్వటం లేద ని, అధిక డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని బాధితులు ముటుకూరి బాజీబాబు, బీ బీమానాయక్, వేజండ్ల నాగేశ్వరరావు, విప్పర్ల కృష్ణ తదితరులు సీఐకు తెలిపారు. తమ వద్ద బంగారాన్ని తాకట్టు పెట్టించుకున్న గోల్డ్ అప్రైజర్ గోపీని కూడా పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చారు. మొత్తం బాధితులకు రూ.12 లక్షలు చెల్లించాల్సి ఉందని గోపీ అంగీకరించాడు. ఫైనాన్స్ అధికా రులు కూడా పోలీసు స్టేషన్‌కు వచ్చి సీఐ బ్రహ్మయ్యతో మాట్లాడారు. బాధితులు రాత పూర్వకంగా ఫిర్యాదుచేస్తే కేసు నమోదు చేయాలని సీఐని కోరారు. ఫైనాన్స్ బాధితుల తరుపున న్యాయం చేస్తామని తెలిపారు. గురువారం ఉదయం నాటికి బాధితులకు న్యాయం చేస్తామని సీఐ బ్రహ్మయ్య ఎదుట ఫైనాన్స్ అధికారులు చెప్పటంతో బాధితు లు, ఫైనాన్స్ అధికారులు, సిబ్బంది స్టేషన్ నుంచి వెళ్ళి పోయారు. బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరించి గురువారం కేసు నమోదు చేస్తామన్నారు.

వెలుగు సీసీ సస్పెన్షన్


మాట్లాడుతున్న బాలునాయక్, మండల సమైక్య అధ్యక్షురాలు నాగలక్ష్మి, ఏపీఎం కృష్ణప్రియ, శ్రీనిధి ఏజీఎం బుల్లియ్య

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లేమల్లె గ్రామంలో సీసీగా పని చేస్తున్న ఎం బాబీని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్ తెలిపారు. గతంలో అచ్చంపేట మండలంలో ఏడు గ్రామాల సమైక్య సంఘాలలో జరిగిన రూ.43 లక్షల నిధుల గోల్‌మాల్‌కు సంబంధించి బాబీ కారణమని విచారణలో తేలడంతో సస్పెండ్ చేసినట్లు బాలునాయక్ తెలిపారు. బుధవారం అమరావతి మండల సమైక్య కార్యాలయంలో బాలునాయక్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండల పరిధిలో జరిగిన సుమారు రూ.2కోట్ల నిధులు గోల్‌మాల్‌కు సంబంధించి విచారణ జరుపుతున్నామని, విచారణలో అలసత్వం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. విచారణ బృందానికి సహకరించని అక్రమార్కులపై పోలీసు కేసులు నమోదు చేస్తామన్నారు. పది రోజులలో విచారణ పూర్తిచేసి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అర్హత ఉన్న గ్రామసమైక్య సంఘాలకు ఋణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు


అమరావతి: ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఆర్టీఓ రాంబాబు

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) నిబంధనలు పాటించని వాహనడ్రైవర్లపై కఠినచర్యలు తీసుకుంటామని అమరావతి ఎస్‌హెచ్‌ఓ వై అచ్చయ్య, పిడుగురాళ్ల మోటారు తనిఖీ అధికారి రాంబాబులు ఆటోడ్రైవర్‌లను హెచ్చరించారు. 36వ జాతీయ రోడ్ భద్రతా వారోత్సవాలలో భాగంగా ఆటోడ్రైవర్‌లకు రహదారి భద్రతపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ప్రతి వాహనానికి సంబంధిత ధ్రువీకరణ పత్రాలు, నడిపే వ్యక్తికి లైసెన్సు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఓవర్‌లోడుతో ప్రయాణిస్తే పెనాల్టీలు భారీగా ఉంటాయని హెచ్చరించారు. మద్యం తాగి వాహ నం నడిపినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఐ అమీర్, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

దుర్గి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): దుర్గి పోలీస్‌స్టేషన్ వద్ద బుధవారం ఎస్ఐ సుధీర్‌కుమార్ వాహనాల తనిఖీ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలపై కేసులు నమోదు చేశారు. 50 మంది కూలీలతో వస్తున్న ట్రాక్టర్‌ను నిలిపి కూలీలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. అతివేగం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ వాహనాల తనిఖీలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


తాడువాయిలో మిర్చిపొలాన్ని పరిశీలిస్తున్న ఏవో పీ వెంకటేశ్వర్లు

తాడువాయిలో మిర్చి పొలం పరిశీలన

● దిగుబడి లేదని రైతు ఆందోళన

అచ్చంపేట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడువాయి గ్రామంలో బుధవారం సుమాన్ సీడ్స్‌కు చెందిన ఠాగూర్-44 మిర్చిపైరును మండల వ్యవసాయ అధికారి పీ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఠాగూర్ మిర్చి రకం విత్తనాలను తాడువాయికి చెందిన రైతు కమతం శ్రీనివాసరావు గుంటూరులో కొనుగోలు చేసి సాగు చేస్తున్నాడు. ఆరు నెలలు కావస్తున్నా ఒక్క కోత కూడా రాకపోవటంతో దిగుబడి లేదని, ఇందుకు ఆ విత్తనమే కారణమని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పైరును పరిశీలించిన ఏవో అక్కడక్కడ చెట్ల కాయలను లెక్కించారు. ఉన్నతాధికారులకు, ఉద్యానశాఖ అధికారులకు తెలియజేస్తానని రైతుకు తెలిపారు. వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

1993లో ఇచ్చిన డీకే పట్టా భూములు పేద రైతులకే

● హద్దులు నిర్ణయించిన రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు

అచ్చంపేట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇచ్చిన డీకే పట్టాలు వారికే దక్కేలా అటవీ, రెవెన్యూ శాఖలు బుధవారం హద్దులు నిర్ణయించాయి. తాళ్ళచెరువు రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.320 నుంచి 337 వరకు పేదలకు ఇచ్చిన డీకే పట్టాలపై అధికారులు హద్దులు నిర్ణయించారు. డీఆర్‌వో కుసుమ కుమారి, అచ్చంపేట డీటీ జానీబాషా, సర్వేయర్ కొండలు, వీఆర్‌వో శేషయ్య, జాయింట్ యాక్షన్ కమిటీలో ఉన్నారు. రెవెన్యూ అధికారులు 1993లో ఎస్ఎఫ్ఎంటీ లేఅవుట్ ప్రకారం డీకే పట్టాలు ఇచ్చిన రైతులకు వెంటనే కొలతలు వేసి పొజిషన్ చూపించాలంటూ పలుమార్లు రైతు సంఘ నాయకులు కోరారు. వ్యవసాయ కార్మికసంఘం మండల కార్యదర్శి కేకే రెడ్డి, సుంకర ఆదినారాయణ, వీ వెంకటేశ్వర్లు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

రామాలయంలో ఎమ్మెల్యే యరపతినేని పూజలు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చంద్రపాలెం రామాలయం 11వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం జరిగిన పూజా కార్యక్రమాలలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, పార్టీ నేతలు ఎమ్మెల్యేకి ఘనస్వాగతం పలికారు. అనంతరం అక్కడున్న కొంతమంది వృద్ధులను యరపతినేని పలకరించి పింఛన్ సక్రమంగా అందుతుందా.. ఏమైనా ఇబ్బందులున్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

● వీరాపురం గ్రామ మాజీ సర్పంచ్ రావి బాబురావు విగ్రహాన్ని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆవిష్కరించారు. వీరాపురం గ్రామ అభివృద్ధికి బాబురావు అందించిన సేవలను గుర్తుచేశారు. కార్యక్రమంలో డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, పాండురంగ శ్రీను, గండికోట వెంకటేశ్వర్లు, వడ్డవల్లి సర్వేశ్వరరావు, ఎల్‌వీఆర్, మల్లెల ఆదినారాయణ, తురకా వీరస్వామి, వున్నం సురేష్, దేవళ్ల కామేశ్వరరావు, బత్తుల రాంబాబు, పిల్లి చెన్నారావు, వేముల ఆంజనేయులు, బత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కందులు కొనుగోలు కేంద్రం ఏర్పాటు

రెంటచింతల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రెంటచింతలలోని వ్యవసాయమార్కెట్ యార్డులో వ్యవసాయ సహాయ సంచాలకులు జగదీశ్వరరెడ్డి బుధవారం కందులు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మద్దతు ధర క్వింటాల్‌కి రూ.7550గా నిర్ణయించారన్నారు. తేమశాతం 12 కన్నా తక్కువగా ఉండాలన్నారు. రైతు సేవాకేంద్రంలో విక్రయదారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏవో బోయపాటి బ్రహ్మారెడ్డి, రాంబాబు నాయక్ పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ కేసుపై గురజాల డీఎస్పీ విచారణ

రెంటచింతల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమృకోట గ్రామాన్ని గురజాల డీఎస్పీ బీఎల్ఎన్ జగదీష్ బుధవారం సందర్శించారు. కిందటేడాది ఫిబ్రవరి 28న కర్రా మఖాయిల్‌ను కులం పేరుతో దూషించారనే ఫిర్యాదుపై సాక్షులను విచారించే నిమిత్తం వచ్చారు. అలాగే మహాశివరాత్రి సందర్భంగా సత్రశాలలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఐ సీహెచ్ నాగార్జున, ఎండోమెంట్స్ ఈవో రామిరెడ్డి తదితరులున్నారు.

ఉపాధ్యాయల సమస్యలపై ఎంఈవోకు వినతి

దాచేపల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎంఈవో మల్లికార్జునశర్మకు ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. యూటీఎఫ్ జిల్లా నాయకులు వడ్డెపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఎంఈవోను కలసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఎన్నికల డ్యూటీ, ఎస్ఎస్‌సీ సప్లమెంటరీ డ్యూటీకి సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను పూర్తిచేయాలని కోరారు.

750 లీటర్ల బెల్లంఊట ధ్వంసం

వెల్దుర్తి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపాడు అటవీ ప్రాంతంలో బుధవారం ఎస్ఐ సమందర్‌వలి తన సిబ్బందితో దాడులు జరిపారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 750 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీఎన్జీవో క్యాలెండర్ల పంపిణీ

మాచర్లటౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయంలో బుధవారం ఏపీఎన్జీవో నేతలు నూతన సంవత్సర క్యాలెండర్‌ను పంపిణీ చేశారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ నఫీజ్‌బాషాకు క్యాలెండర్‌ను అందించారు. కార్యక్రమంలో ఏపీఎన్జీవో అధ్యక్షుడు ఎస్‌కే కాశీం, కార్యదర్శి నాగేశ్వరరావు, రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త వేరు చేయటంపై శిక్షణ

సత్తెనపల్లి రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): వ్యర్థాల ద్వారా సంపద సృష్టించవచ్చని డీపీవో ఎంవీ భాస్కర్‌రెడ్డి అన్నారు. నందిగామ వద్ద గల ఘనవ్యర్థాల నిర్వహణ కేంద్రంలోని ట్రైనింగ్ సెంటర్‌లో బుధవారం డ్వాక్రా మహిళలకు తడి, పొడి చెత్త వేరుచేసే విధానంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శిక్షణలో ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్త వేరుచేసే విధానం, వ్యర్థాల ద్వారా వర్మి కంపోస్టు తయారీపై డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎస్ఐఆర్‌డీ ఫ్యాకల్టీ డాక్టర్ మోహనరావు, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరెడ్డి, ఐటీసీ రీసోర్స్‌పర్సన్ చంబేటి బొల్లయ్య, పంచాయతీ కార్యదర్శులు కుంభా వెంకటేశ్వర్లు, సీహెచ్ కృష్ణప్రసాదు పాల్గొన్నారు.

నకరికల్లు కేజీబీవీకి 40 కుర్చీల వితరణ

నకరికల్లు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): నకరికల్లు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయానికి షేక్ చినమహబూబ్ సుభానీ రూ.15వేల విలువైన 40 కుర్చీలను అందజేశారు. తన భార్య షకీలబేగం పేరిట ఈ కుర్చీలను కేజీబీవీకి అందజేశారు. సుభానీకి ప్రిన్సిపాల్ కొండవీటి లక్ష్మి ధన్యవాదాలు తెలిపారు.

వైసీపీ నేతలతో మాజీ ఎమ్మెల్యే పీఆర్కే

రెంటచింతల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బుధవారం విజయవాడ వెళ్తూ రెంటచింతలలో వైసీపీ నేతలతో సమావేశమయ్యారు. గత మే 13న పోలింగ్ అనంతరం తొలిసారి పీఆర్కే రెంటచింతల వచ్చారు. పార్టీ నేతల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పీఆర్కేను కలిసినవారిలో వైసీపీ సీనియర్ నేతలు ఏరువ ప్రతాప్‌రెడ్డి, ఆదూరి సాగర్‌రెడ్డి, బీ శౌరెడ్డి, భాస్కర్‌రెడ్డి, గొట్టం భాస్కరరెడ్డి, ముత్తయ్యయాదవ్ ఉన్నారు.

రేపు విద్యార్థులకు టాలెంట్ టెస్టు

రాజుపాలెం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గణపవరంలోని మంచాల పరశురామయ్య అలివేలమ్మ జడ్పీ హైస్కూలు పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో విద్యార్థులకు టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్లు పూర్వవిద్యార్థుల కమిటీ సభ్యులు తెలిపారు. మండలంలోని అన్ని జడ్పీ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులు ఈ నెల 7వ తేదీ జరిగే టాలెంట్‌టెస్టుకు హాజరుకావాలని, ఎంపికైన విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేస్తామని వివరాలకు 7989957279 నెంబరును సంప్రదించాలన్నారు.



నగరవనంలో.. శిల్ప సోయగం

గుంటూరు సమీపంలోని పేరేచర్లలో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నగరవనం పర్యాటకులకు ఆహ్లాదం పంచుతోంది. గత ప్రభుత్వంలో నిరాదరణకు గురైన ఈ వనం ప్రస్తుతం జంతు శిల్పాలతో అడవిలోనే ఉన్నామా అనే విధంగా పర్యాటకులకు కనువిందు చేస్తోంది. నగరవనంలోకి అడుగు పెడితే పులులు..ఏనుగులు..కొండచిలువ.. తోడేళ్ళు.. జింకలు.. బల్లులు కనిపిస్తాయి.మొదటిసారి వాటిని చూస్తే అవి నిజంగా ఉన్నాయేమో అనిపిస్తుంది. కానీ అవి శిలలపై చెక్కిన శిల్పాలు. బొమ్మలే కానీ కళాచాతుర్యంతో జీవం పోశారు. ఆహ్లాదం కోసం అక్కడకు వెళ్లే అనేకమందికి ప్రస్తుతం అవే కనువిందు చేస్తున్నాయి.అటవీశాఖ అధికారుల ఆలోచనకు అందరి ప్రశంసలు వస్తున్నాయి.

-గుంటూరు, ఆంధ్రజ్యోతి

వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన తమిళనాడు బృందం

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్ర వ్యవసాయ ఉన్నతాధికారి బాల సౌందరి టీం లీడర్‌గా ఉన్న నలుగురు సభ్యుల బృందం జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్రానికి వచ్చిన ఈ ఉన్నధికారుల బృందం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. మంగళగిరిలోని సమీకృత వ్యవసాయ


లాంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న తమిళనాడు ఉన్నతాధికారుల బృందం

పరీక్ష కేంద్రంతో పాటు, పొన్నూరు, తాడికొండ, వట్టిచెరుకూరు మండలాల్లోని గ్రామాల్లో పర్యటించి రాష్ట్ర ప్రభుత్వం పథకాలైన పొలంపిలుస్తోంది, ప్రకృతి వ్యవసాయం, ఈ క్రాప్‌లో పంటల నమోదు, కౌలు రైతులకు రుణ విధానం, వడ్డీ లేని రుణాలు తదితర వాటి మార్గదర్శకాలు, నియమ నిబంధనలు అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయ సాగు విధానంలోని ఆదాయ, వ్యయాల వివరాలను సేకరించారు. బీజా మృతం, ఘన జీవామృతం, ద్రవ జీవామృతముల తయారీ విధానంను వారికి ప్రకృతి వ్యవసాయ టీం చూపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిషనరేట్ కార్యాలయం నుంచి డీడీ వెంకటేశ్వరరావు, ఏడీ ఆచారి, జిల్లా ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

పట్టభద్రులను ప్రభావితం చేస్తే చర్యలు

◆ ఓటింగ్‌పై అవగాహన కార్యక్రమాల నిర్వహణ ◆ కృష్ణా - గుంటూరు ఎమ్మెల్సీ ఎన్నికల ఆర్‌వో నాగలక్ష్మి

గుంటూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): 'పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నది. ఎవరూ పట్టభద్రులైన ఓటర్లను ప్రభావితం చేసే చర్యలు చేపట్టొద్దు. అలా చేస్తే వారిపై ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన కింద కఠిన చర్యలు చేపడతాం..' అని గుంటూరు-కృష్ణా జిల్లాల నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై ఆమె ఏఆర్‌వో షేక్ ఖాజా వలితో కలిసి కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఓటర్లు పట్టణ ప్రాంతాల్లో అధికంగా ఉన్నారని, ఒక్కో పట్టణంలో నాలుగు నుంచి ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసి ఎలక్షన్ కోడ్ అమలుని పర్యవేక్షిస్తున్నామన్నారు. సభలు, సమావేశాలు ఇతర ప్రచార కార్యక్రమాలకు ముందస్తు అనుమతి తీసుకోవడం తప్పనిసరన్నారు. ఇందుకోసం ఏఆర్‌వో కార్యాలయాల్లో సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇస్తామన్నారు. ఎమ్మెల్సీ ఓటు వేయడంపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఓట్ల లెక్కింపు ఏ అభ్యర్థికి అయినా 50 శాతం ప్రాధాన్య ఓట్లు వచ్చేంత వరకు కొనసాగుతుందన్నారు. తొలి ప్రాధాన్య ఓట్లలో ఎవరికి 50 శాతం ఓట్లు దాటకపోతే అతి తక్కువ సంఖ్యలో


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌వో నాగలక్ష్మి, పక్కన ఏఆర్‌వో ఖాజావలి

ఓట్లు వచ్చిన అభ్యర్థికి వచ్చిన ఓట్లను షేరింగ్ చేస్తూ ఎలిమినేట్ చేసుకుంటూ పోతామన్నారు.

ఎమ్మెల్సీ ఓటు వేయడం ఎలా..

- ఓటు వేసే సమయంలో పీవో వంకాయ రంగు స్కెచ్ పెన్నుని బ్యాలెట్ పేపర్‌తో సరఫరా చేస్తారు. దానిని వినియోగించే ఓటరుకు ప్రాధాన్యాలను ఇవ్వాల్సి ఉంటుంది. మరే ఇతర పెన్ను, పెన్సిల్ వినియోగించరాదు.
- ఎంతమంది అభ్యర్థులకు అయినా ఓటు వేయొచ్చు. అయితే ఒక అభ్యర్థికి ఒక ప్రాధాన్య ఓటు మాత్రమే అంకెల ద్వారా ఇవ్వాలి. ఒక అభ్యర్థికే ఓటు వేయదలిస్తే 1 మాత్రమే నమోదు చేయాలి. ఉదాహరణకు నలుగురు అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వదలిస్తే 1, 2, 3, 4 అని నెంబర్లు ఇవ్వాలి. 1 ప్రాధాన్య ఓటు వేసి 2వ ప్రాధాన్యం ఇవ్వకుండా 3, 4 ఇస్తే ఆ ఓటు చెల్లదు. అభ్యర్థి పేరకు ఎదురుగా ఒక అంకె మాత్రమే వేయాలి.
- రోమన్ అంకెలలో అయినా ప్రాధాన్య ఓటుని పేర్కొనవచ్చు.
- అంకెకి సున్నా చుట్టడం, పక్కన చుక్క పెట్టడం, బ్రాకెట్ పెట్టడం వంటివి చేయరాదు.
- బ్యాలెట్ పేపర్‌పై ఎలాంటి సంతకం, వేలిముద్ర వేయరాదు.

పోలింగ్ స్టేషన్ల సంఖ్య

జిల్లా	ప్రతిపాదిత స్టేషన్లు	అనుబంధ స్టేషన్లు	మొత్తం
గుంటూరు	118	31	149
పల్నాడు	73	17	90
బాపట్ల	28	6	34
ఏలూరు	20	1	21
ఎన్‌టీఆర్	101	11	112
కృష్ణా	76	1	77

ఓటర్ల సంఖ్య ఇలా...

జిల్లా	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్లు	మొత్తం
గుంటూరు	62277	45318	18	107613
బాపట్ల	15292	9150	5	24447
పల్నాడు	37381	19129	4	56964
ఏలూరు	9858	6218	1	16077
కృష్ణా	35378	27807	5	63190
ఎన్‌టీఆర్	45540	32685	13	78238

కుంభమేళాకు ఆర్టీసీ స్పెషల్ బస్సు

● టిక్కెట్ ధర రూ. 8,300

గుంటూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గుంటూరు నుంచి మహా కుంభమేళాలో పుణ్య స్నానాల కోసం (ప్రయాగరాజ్)కు వెళ్ళే వారి కోసం ఆర్టీసీ గుంటూరు-2 డిపో అధికారులు స్పెషల్ హైటెక్ (2+2) పుష్ బ్యాక్ సూపర్ లగ్జరీ బస్సు సౌకర్యం కల్పించారు. మొత్తం 8 రోజుల యాత్రతో ప్రత్యేక సర్వీసును ఏర్పాటు చేసినట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 11న గుంటూరు బస్టాండ్‌లో ఉదయం 10 గంటలకు బస్సు బయల్దేరుతుందన్నారు. మొత్తం 8 రోజుల్లో తొలి రోజు గుంటూరు నుంచి బయల్దేరి రెండో రోజు సాయంత్రానికి కుంభమేళా ప్రయాగ్‌రాజ్‌కు చేరుకుంటుందన్నారు. మూడో రోజు మొత్తం ప్రయాగరాజ్‌లో బస చేసి పుణ్య స్నానాలు ఆచరించి, 4వ రోజు రాత్రికి అయోధ్య చేరేందుకు బయల్దేరుతుం దన్నారు. 5వ రోజు ఉదయం అయోధ్య చేరుకొని, బాలరాముని దర్శించుకొని, సాయంత్రానికి వారణాసి బయల్దేరుతుందని ఆరో రోజు ఉదయం వారణాసి చేరుకొని, ఆ రోజు వారణాసిలో బస చేసి ఏడో రోజు ఉదయం వారణాసి నుండి బయలు దేరి ఎనిమి దివ రోజు రాత్రికి గుంటూరు చేరుకుంటుం దన్నారు. ఈ సర్వీస్ కు 91927 ఆన్‌లైన్ సర్వీస్ నంబర్ ద్వారా రిజర్వేషన్ చేసుకొనే అవకాశం కూడా ఉందని డీఎం తెలిపారు. 10 కిలోమీటర్లు లోపు 35 మంది ప్రయాణికులు ఒకే చోటు నుండి బయల్దేరితే బస్సు అక్కడికి పంపటం జరుగుతుందన్నారు. ఒక్కో టికెట్ ధర రూ. 8300 మాత్రమే నని, ఇతర ఖర్చులు, భోజనం, వసతి ఖర్చులు ఎవరి ఖర్చులు వారే భరించాల్సి ఉంటుందన్నారు. వివరములకు 7382897459, 7382896403, 7382894613 సంప్రదించాలన్నారు.



సేద్యానికి.. డ్రోన్లు

5వ పేజీ తరువాయి)

ఉపయోగకరమని ప్రభుత్వం భావిస్తోంది. రోజుకు దాదాపు పదిహేను ఎకరాల్లో డ్రోన్ల సాయంతో సస్యరక్షణ చేపట్టే అవకాశం ఉంది. డ్రోన్ల సేవలను గరిష్ఠంగా ఉపయోగించుకుంటే సమయం ఆదాతో పాటు కూలి ఖర్చులు రైతులకు మిగులుతాయి.

ఇది తొలి అడుగుగానే...

సేద్యమే ప్రధాన రంగంగా ఆధారపడిన ఉమ్మడి గుంటూరు జిల్లాలో తొలుత మండలానికి ఓ యూనిట్‌గా డ్రోన్ల వినియోగం అనేది తొలి అడుగుగానే వ్యవసాయశాఖ చెబుతోంది. బాపట్ల జిల్లాలో ఇప్పటికే 35 యూనిట్లకు సంబంధించి గ్రూపుల ఎంపిక పూర్తయింది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా మండలానికి ఓ గ్రామాన్ని యూనిట్‌గా ఎంపిక చేసి గ్రూపుల ఎంపికను కూడా ఓ కొలిక్కి తెచ్చారు. గ్రూపు సభ్యుల చేత బ్యాంకు ఖాతాలు తెరిచే ప్రక్రియ కూడా పూర్తి చేశారు.

దశలవారీగా సాంకేతికత..

దశల వారీగా వ్యవసాయంలో టెక్నాలజీని ప్రవేశపెట్టి సాగుకు సాంకేతిక హంగులు అద్దే కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతుందని ప్రభుత్వం చెబుతోంది. ముఖ్యంగా ప్రకృతి విపత్తులకు సంబంధించి కచ్చితమైన సమాచారాన్ని నేరుగా రైతు చెంతకే చేరేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వ్యవసాయశాఖ చెబుతోంది. పిడుగుపాటుకు గురై మరణించే వారిలో అత్యధికులు రైతులే. ముందస్తు సమాచారంతో అప్రమత్తం ఒక్క సాంకేతికతతోనే సాధ్యమవుతుందని ఆ దిశగానే రాబోయే రోజుల్లో చర్యలు ఉండనున్నాయని ప్రభుత్వం అంటోంది.

రైతులకు సాయం.. ఉపాధి

డ్రోన్లను ఆపరేట్ చేసే వ్యక్తికి ఇంటర్మీడియట్ కనీస విద్యార్హత ఉండాలని ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొంది. పైలెట్‌కు సపోర్టింగ్ స్టాఫ్ కూడా కావాల్సి ఉంటుంది. వీరికి నెలవారీ ఇచ్చే జీతాన్ని డ్రోన్లకు వచ్చే నామమాత్రపు అద్దెతో పాటు ప్రభుత్వం కూడా కొంత భరించనుంది. దశల వారీగా డ్రోన్లను పెద్దఎత్తున ప్రవేశపెట్టాలనే తలంపుతో ప్రభుత్వం ఉండడంతో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు ఐదు వేల మందికి వీటి నిర్వహణ నిమిత్తం ఉపాధి దొరకనుంది. సాంకేతికత విధానం రైతులకు పూర్తి స్థాయిలో అవగతమయ్యే వరకు వీరి అవసరం ప్రతి దశలో ఉండనుంది. దీంతో అటు రైతులకు సేద్యం లాభసాటిగా మారడంతో పాటు ఇటు గ్రామాల్లో నిరుద్యోగ సమస్యకు కొంతమేర పరిష్కారం చూపేలా ప్రభుత్వం అడుగులేస్తోంది. గ్రూపులో సభ్యులుగా ఉండే రైతులు కాకుండా మరో ఐదుగురితో కమిటీ ఏర్పాటు చేస్తారు. వీరిలో ఒకరు డ్రోన్ పైలెట్‌గా ఉండగా అతనే కన్వీనర్‌గా కూడా ఉండనున్నారు. ఇంకొకరు కో కన్వీనర్‌గా, మరో ఇద్దరు సభ్యులుగా కమిటీలో వ్యవహరిం చనున్నారు. పైలెట్‌గా విధులు నిర్వహించే వ్యక్తికి ఇంటర్మీడియట్ చదువును తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రస్తుతం ఈ పైలెట్ లకు శిక్షణ ఇచ్చే కార్య క్రమంపై వ్యవసా య శాఖ దృష్టి సారించింది.

నేటి నుంచి విజ్ఞాన్ మహోత్సవ్

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో నేటి నుంచి జాతీయ స్థాయి విజ్ఞాన్ మహోత్సవ్ ప్రారంభం కానున్నట్లు వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ నాగభూషణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజ్ఞాన్ మహోత్సవ్ పోటీల విజేతలకు రూ.15 లక్షలకు పైగా బహుమతులను అందజేస్తామని తెలిపారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మహోత్సవ్‌లో మొత్తం 80 ఈవెంట్లను నిర్వహించనున్నారు. ముఖ్య అతిథులుగా ఇండియన్ సింగర్, మ్యూజిక్ కంపోజర్ డాక్టర్ సాలూరి కోటేశ్వరరావు (కోటి), ఇండియన్ మ్యూజిక్ కంపోజర్ అండ్ ప్లేబాక్ సింగర్ ఎస్ఎస్ థమన్, గౌరవ అతిథిగా మాజీ ఇండియన్ వాలీబాల్ ప్లేయర్ మన్యం తులసి రెడ్డి హాజరవుతారని వెల్లడించారు. రెండో రోజు కార్యక్రమానికి ఇండియన్ యాక్టర్, డైరెక్టర్, స్క్రీన్ రైటర్, హీరో విశ్వక్ సేన్, హీరోయిన్ ఆకాంక్ష శర్మ, యాక్టర్ అభిమన్యు సింగ్ విచ్చేస్తున్నారని పేర్కొన్నారు. చివరి రోజు జరిగే ముగింపు కార్యక్రమానికి ఇండియన్ ఫిల్మ్ డైరెక్టర్, స్క్రీన్ రైటర్ కేఎస్‌రవీంద్ర (బాబీ), 2024 పారా లింపిక్స్ బ్రాంజ్ మెడలిస్ట్, ఇండియన్ పారా పిస్టల్ షూటర్, అర్జున అవార్డు గ్రహీత రుబినా ఫ్రాన్సిస్ రానున్నారని తెలియజేసారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, సీఈవో డాక్టర్ మేఘన కూర పాటి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొంటారని వీసీ తెలిపారు.


విజ్ఞాన మహోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్న విద్యార్థులు

ఆరు జిల్లాల్లో.. అనుమతులంటే ఎలా?

● సతమతమవుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థులు

● ఏక గవాక్ష విధానంలో గుంటూరులోనే ఇవ్వాలని వినతి

గుంటూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం ఎన్నికలకు సంబంధించి ర్యాలీలు, సభలు, సమావేశాలు, ఇతర ప్రచార కార్యక్రమాలు చేసుకోవడానికి అభ్యర్థులకు పెద్ద చిక్కు వచ్చి పడింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాల విభజన జరిగిన కారణంగా ప్రస్తుతం ఈ నియోజకవర్గం ఆరు జిల్లాల పరిధిలో ఉన్నది. దీంతో ఆయా జిల్లాలకు వెళ్లి అనుమతులు తీసుకోవాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. ఎన్నికలకు మరో నెల సమయం కూడా లేకపోవడంతో తమ సమయం అంతా ఈ అనుమతులు తీసుకోవడానికే సరిపోతుందని ఇప్పటికే నామినేషన్ వేసిన అభ్యర్థులు, మరో రెండు, మూడు రోజుల్లో దాఖలు చేయబోతున్న క్యాండేట్లు వాపోతున్నారు. ఈ విషయంలో నిబంధనలను ఎన్నికల సంఘం సడలించాలని కోరుతున్నారు.

గతంలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో మాత్రమే ఈ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం ఉండేది. దాంతో అప్పట్లో అనుమతులు రెండు చోట్ల తీసుకొంటే సరిపోయేవి. ఇప్పుడు అలా కాదు. గుంటూరు, పల్నాడు, బాపట్ల, కృష్ణ, ఎన్‌టీఆర్, ఏలూరు జిల్లాల అధికారుల అనుమతులు తీసుకోవాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. గత నెల చివరి వారంలోనే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఈసీ ఆదేశాల మేరకు ఆ రోజు నుంచి సాదారణ ఎన్నికల వలే ప్రవర్తన నియమావళిని అధికారులు పకడ్బందీగా అమలు చేస్తున్నారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడగడం, బహిరంగ ప్రదేశాల్లో ఫ్లెక్సీల తొలగింపు వంటివి పూర్తి చేశారు. బుధవారం సాయంత్రం వరకు నలుగురు నామినేషన్లు వేశారు. ఇంకా మరో ఐదు రోజుల సమయం ఉన్నందున ఆయా జిల్లాల నుంచి మరికొందరు నామినేషన్లు వేసే అవకాశం ఉన్నది.

కాగా ఆయా అభ్యర్థులు ఎన్నికల ప్రచార కార్యక్రమాల కోసం అనుమతులు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారి అయిన గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి స్పష్టం చేశారు. ప్రతీ జిల్లాలో ఏఆర్‌వో(డీఆర్‌వో/ఎస్‌డీసీ)ల వద్దకు వెళ్లి అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాలని చెబుతున్నారు. అక్కడ ఏకగవాక్ష విధానంలో అనుమతులు ఇస్తారని పేర్కొంటున్నారు. అయితే ఆరు జిల్లాల్లో తీసుకోవాలంటే చాలా కష్టమౌతుందని, దీనికే రెండు, మూడు రోజుల సమయం పడుతున్నందున నిబంధనలను సడలించాలని కోరుతున్నారు. ఈ మేరకు బుధవారం ఎల్ రాజగోపాల్ అనే వ్యక్తి కలెక్టరేట్‌కు వచ్చి ఆర్‌వో నాగలక్ష్మికి ఫిర్యాదు అందజేశారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

44కు చేరిన సాయి సాధన చిట్ ఫండ్ బాధితుల సంఖ్య

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): భారీ సంఖ్యలో డిపాజిట్‌దారులను, చిట్ ఫండ్ ఖాతాదారులను మోసగించిన కేసులో సాయి సాధన చిట్‌ఫండ్ కంపెనీపై బుధవారం వరకు ఫిర్యాదు చేసిన వారి సంఖ్య 44కు చేరింది. బుధవారం 40మంది బాధితులు మొదటి పట్టణ సీఐ చరణ్‌ను కలిసి తమగోడు వెల్లడించుకున్నారు. బాధితుల్లో చిట్ ఫండ్ బాధితులు ఐదు కోట్ల మేరకు డిపాజిట్ చేసిన వారు నాలుగు కోట్ల మేరకు నష్టపోయినట్లు తెలిపారు. ఈ మేరకు వివరాలను నమోదు చేసుకున్నామని బాధితులకు న్యాయం జరిగేలా తగుచర్యలు తీసుకుంటామని సీఐ చరణ్ తెలిపారు.

200 పడకల ఆసుపత్రిలో సిబ్బందిని భర్తీ చేస్తాం

● హెల్త్ డైరెక్టర్ సిరి

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): త్వరలో పల్నాడు జిల్లా 200 పడకల వైద్యశాలలో ఖాళీగా ఉన్న వైద్యులు, నర్సింగ్ సిబ్బంది ఖాళీలను పూర్తిస్థాయిలో భర్తీ చేయనున్నట్లు రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ డైరెక్టర్ ఏ సిరి బుధవారం తెలిపారు. బుధవారం ఆమె పట్టణంలోని లింగంగుంట్ల లోని ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేశారు. తొలుత వైద్యులు నర్సింగ్ సిబ్బందితో సమావేశమయ్యారు. సమావేశంలో వైద్యశాలలో రోగులకు సమర్థవంతమైన సత్వర సేవలు అందించడానికి తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. వైద్యశాల ఈఎన్‌టీ, పీడియాట్రిక్ విభాగాల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశ అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ పల్నాడు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు రోజుకు ఎనిమిది వందల నుంచి 1000మంది పేషెంట్లు ఓపీకి వస్తున్నారన్నారు. ఓపీ కౌంటర్ల సంఖ్యను ఐదు పెంచాలని సిబ్బంది సూచించామన్నారు. ఓపీ కార్డులు నమోదు చేసుకోవటానికి కూడా ఆధార్ కార్డు లింక్ అయిన ఫోన్ నెంబర్‌ను తీసుకు వచ్చినట్లయితే క్యూలో ఉండకుండా తక్షణమే నమోదు చేసుకోవచ్చన్నారు. ఆమెవెంట సెకండరీ హెల్త్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ కిషోర్ ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండ్ డాక్టర్ సిబ్బంది ఉన్నారు. ఈ సందర్భంగా విలేకరులు దివ్యాంగులకు గత ప్రభుత్వం ఇచ్చిన సర్టిఫికెట్లు ఎందుకు చెల్లటం లేదని ప్రశ్నించారు. ఈ ధ్రువీకరణ పత్రాలు నిబంధనలకు విరుద్ధంగా తీసుకున్నవి అయి ఉండొచ్చని తెలిపారు. బుధవారం ప్రభుత్వ వైద్యశాలలో నాదెండ్ల మండలం చందవరంకు చెందిన శిరోమణి అనే మహిళ రక్తహీనతతో చికిత్స పొందుతూ మరణించటంపై ఆమె దృష్టికి తీసుకెళ్లగా అక్కడే ఉన్న వైద్యులను దీనిపై ప్రశ్నించారు. ఆమెకు గుండెపోటు కూడా వచ్చిందని రక్త మార్పిడికి అనుకూలంగా లేదని సిబ్బంది తెలిపారు.

మాజీ మంత్రి రజినిపై పోరాటం ఆగదు: పిల్లి కోటి

చిలకలూరిపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి విడదల రజిని అరాచకాలపై తన పోరాటం ఆగదని చిలకలూరిపేట టీడీపీ నాయకుడు పిల్లి కోటి బుధవారం విలేకరులతో అన్నారు. వైసీపీ ఆరాచకాలను సోషల్ మీడియాలో ప్రశ్నించినందుకు తనను చిలకలూరిపేట అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఐదు రోజుల పాటు అక్రమంగా నిర్బంధించి, దారుణంగా కొట్టారన్నారు. ఆ సన్నివేశాలను వీడియోకాల్‌లో చూసి వికృతానందం పొందిన రజినిపై రెండు నెలల క్రితం జిల్లా ఎస్పీ, డీఎస్పీ, చిలకలూరిపేట సీఐలకు ఫిర్యాదుచేసినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదన్నారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి, తనకు న్యాయం చేయాలని హైకోర్టును ఆశ్రయించినట్టు తెలిపారు. బుధవారం జిల్లా ఎస్పీని కలిసి వినతిపత్రం ఇచ్చానన్నారు.

క్లుప్తంగా...

● శావల్యాపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో రైతులను బీజేపీ ప్రభుత్వం నిలువునా మోసం చేసిందని సీపీఎం మండల కార్యదర్శి కేవీఆర్ మోహన్ చంద్ అన్నారు. కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా శావల్యాపురం సెంటర్‌లోని అల్లూరి సీతారామయ్య విగ్రహం వద్ద మండల సీపీఎం నాయకులు బుధవారం నిరసన ప్రదర్శన చేపట్టారు.

● వినుకొండ టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా సీపీఐ ఆధ్వర్యంలో శివయ్య స్థూపం సెంటర్‌లో బుధవారం నిరసన వ్యక్తం చేశారు.

● వినుకొండ: ఎన్‌టీఆర్ వైద్య సేవా పథకంలో పనిచేస్తున్న వైద్యమిత్రల సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రాష్ట్ర సచివాలయంలోని వైద్యఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబుకు బుధవారం వినతిపత్రం అందజేశారు.

● వినుకొండ: శ్రీనివాసనగర్‌లోని అలివేలుమంగ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయం హుండీని బుధవారం లెక్కించారు. గత 19నెలల కాలానికి హుండీ ఆదాయం రూ.5,39,430లక్షలు వచ్చినట్లు ఆలయవర్గాలు తెలిపారు.

● బొల్లాపల్లి: ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషనర్ బీ పద్మావతి బుధవారం మండలంలో ఆకస్మిక తనిఖీ చేశారు. ఇంటర్ చదివే బాలికలకు స్టాక్ రూమ్‌లో కూర్చోబెట్టి వసతులు లేకుండా బోధిస్తున్నారని, పాఠశాల ప్రధానోపాధ్యాయినికి, మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న ఇన్‌చార్జ్ హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసులు అందజేయాలని పల్నాడు జిల్లా విద్యా శాఖ అధికారిని ఆదేశించామన్నారు. ఆమె వెంట సీడీపీవో అరుణ, మహిళా పోలీసు మల్లేశ్వరి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఉన్నారు.

● నరసరావుపేట టౌన్: నరసరావుపేట పట్టణం రాజాగారి కోటలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఆసుపత్రిలో 9న ఉచిత గుండె, ఎముకల వైద్య శిబిరం జరుగుతుందని మందాడి రవి బుధవారం తెలిపారు. కామినేని ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ ఉచిత వైద్య శిబిరం జరుగుతుందన్నారు. బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో, ఎముకల సాంద్రతను నిర్ధారించే బీఎండీ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తాగునీరు అందేనా..?

● అత్యధిక గ్రామాల్లో ఫ్లోరైడ్ నీరే శరణ్యం
● అమలుకాని జల్‌జీవన్ మిషన్
● ప్రజలకు శాపంలా పాలకుల అలసత్వం, అధికారుల నిర్లక్ష్యం



నిరుపయోగంగా ఉన్న తలార్లపల్లి తాగునీటి రిజర్వాయర్

నూజెండ్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అధికారుల బాధ్యతా రాహిత్యం, పాలకుల అలసత్వం మండల ప్రజలకు శాపంగా మారాయి. గ్రామాల్లో ప్రజలకు రక్షిత తాగునీరు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నా అమలు తీరు అగమ్య గోచరంగా ఉన్నది. మండలంలోని 27 గ్రామ పంచాయతీలు, 64 గ్రామాల్లో 50వేలకు పైగా ప్రజలు నివశిస్తున్నారు. ఫ్లోరిన్ పీడిత గ్రామాల్లో విషతుల్యమైన నీటిని బోరు బావుల నుంచి వినియోగించుకోక తప్పని పరిస్థితి నెలకుంది. కొందరు ఆర్థిక భారమైనా మినరల్ వాటర్‌ను వినియోగించుకుంటున్నారు. కాగా గృహ అవసరాలకు, పశువులకు ఫ్లోరిన్ వాటరే వినియోగించక తప్పని పరిస్థితి. కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన పథకాలు అలంకార ప్రాయంగానే మిగిలాయి. అధికారుల పర్యవేక్షణా లోపం, ప్రజలు రక్షిత తాగునీరు కావాలని ప్రశ్నించకపోవటంతో పథకాలన్నీ లక్ష్యాలను అందుకోలేక ఆగిపోయాయి. ముఖ్యంగా పుచ్చనూతల, తలార్లపల్లి, మృత్యుంజాపురం, త్రిపురాపురం పథకాలు పూర్తిస్థాయిలో ఆగిపోగా పాతచెరుకుంపాలెం, ములకలూరు, ముక్కెళ్ళపాడు సీపీడబ్ల్యూ పథకాలు కొంతమేర నామమాత్రంగా పనిచేస్తున్నాయి. జల జీవన్ మిషన్ ద్వారా నూజెండ్ల బీసీ కాలనీలో వేసిన జీఐ పైపులైన్ పాడై పోవటంతో నేడు ఆ పైపులు కూడా చోరీకి గురవుతున్నాయి. అధికారులు, పాలకులు ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధచూపి పథకాలను పూర్తి స్థాయిలో అమల్లోకి తీసుకు రావాలని మండల ప్రజలు ఆశిస్తున్నారు.

తాగు నీరు ఇచ్చేందుకు ఏర్పాట్లు: ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎం.అశోక్



మండలంలోని అన్ని గ్రామాలకు అమృతధార పథకం ద్వారా ఇంటింటికి తాగునీరు అందించేలా కార్యాచరణ చేపట్టినట్టు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి ఎం.అశోక్ వివరించారు. జల జీవన్ మిషన్‌లో భాగంగా మండలంలో 92 పనులు గుర్తించగా 30 గ్రామాల్లో పనులు పూర్తయ్యాయని, మిగిలిన గ్రామాల్లో టెండర్లు రద్దు కాగా నేడు అమృత ధార పథకం ద్వారా మరలా టెండర్లు పిలవనున్నట్టు తెలిపారు. గ్రామాల్లో ఇంటింటికి తాగునీరు అందించేందుకు వేసిన పైపులైన్‌లు భూమిలో వేసేందుకు ప్రాధాన్యం ఇస్తున్నామని, సిమెంట్ రోడ్లు ఉన్న చోట జీఐ పైపులైన్‌లు వేయటం జరిగిందని, ఈ విధానంలో జీఐ పైపులైన్‌లు ప్రజలకు రాకపోకలు సాగించేందుకు అడ్డంగా ఉన్నాయని ఫిర్యాదులు అందుతున్నాయన్నారు.



పుచ్చనూతలలో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్, నూజెండ్ల బీసీ కాలనీలో పాడైపోయిన జల జీవన్ మిషన్ పైపులైన్‌లు

దొండపాడుకు తారురోడ్డు నిర్మాణం

స్థానికుల్లో హర్షాతిరేకాలు



తారురోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మించడమే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధ్యేయమని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. వినుకొండ నుంచి దొండపాడుకు సుమారు రూ.6కోట్ల నాబార్డు నిధులతో నూతనంగా నిర్మిస్తున్న తారురోడ్డు నిర్మాణ పనులను ఆయన మండల నాయకులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానికులు ఆయనకు ఘనస్వాగతం పలికి ధన్యవాదాలు తెలియజేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన రోడ్డును వైసీపీ ప్రభుత్వం అడ్డుకుందన్నారు. శ్రీరామ్‌నగర్ సమీపంలో రోడ్డును, అనంతరం కార్యకర్తలతో కలిసి పానకాలపాలెం సమీపంలోగల చప్టాను పరిశీలించారు. త్వరలో చప్టా మరమ్మతులు చేపట్టి రాకపోకలు అంతరాయం లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షులు, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ మాదినేని ఆంజనేయులు, డీసీ కొండలు, గోవిందరాజులు, మద్దుకూరి రాంబ్రహం, మేడా అశోక్, దావులూరి మున్నెయ్య, రామకోటేశ్వరరావు, బోడెపూడి వీరాంజి, నర్సయ్య, కృష్ణారెడ్డి, ఏఈ శ్రీనివాసరావు, కాంట్రాక్టర్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట ప్రాంతంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు




రీ సర్వే గురించి రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్ బాబు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ పి. అరుణ్‌బాబు చిలకలూరిపేట మండలం కావూరు, లింగంగుంట్ల గ్రామాలలో బుధవారం ఆకస్మిక తనిఖీలు జరిపారు. కావూరులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం జాతీయ ఉపాధి హామీ పథకం కింద పంట కాలువలలో పూడిక తీత పనులను పరిశీలించారు. అనంతరం లింగంగుంట్ల వద్ద భూముల రీ -సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సర్వే సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మాధవీలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మిర్చి రైతులను కేంద్రం ఆదుకోవాలి: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ధరల పతనంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న మిర్చి రైతులను కేంద్రం తక్షణమే ఆదుకోవాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అంతర్జాతీయ పరిస్థితులకు అనుగుణంగా నూతన సాగు విధానాలపై దేశంలోని మిర్చి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వ్యాపారుల మాయాజాలం, మార్కెట్ హెచ్చుతగ్గుల కట్టడికి ప్రత్యేక చట్టాలతో చెక్ పెట్టి, రైతుల కష్టానికి తగిన ఫలితం దక్కేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మిర్చి ధరల తగ్గుదల, రైతుల సమస్యలను నరసరావుపేట ఎంపీ లావు కృష్ణ దేవరాయలు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని, లోక్ సభ ప్రశ్నోత్తరాల సమయంలో మిర్చి రైతుల కష్టాలు, ధరల క్షీణత, పంటల బీమా సమస్యను ఆయన కేంద్ర వ్యవసాయమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు తెలిపారని పుల్లారావు వివరించారు.

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా వెంకట సుధాకర్‌బాబు ఎంపిక



సుధాకర్‌బాబును అభినందిస్తున్న శశికుమార్, యార్లగడ్డ లెనిన్

వినుకొండ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీ వినుకొండ పట్టణశాఖ అధ్యక్షుడిగా కోటా వెంకట సుధాకర్‌ను పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఏలూరి శశికుమార్ బుధవారం ప్రకటించారు. నరసరావుపేటలో ఏర్పాటుచేసిన ముఖ్యనాయకుల సమావేశంలో రాష్ట్ర సంఘటిత కార్యదర్శి మధుకర్ సమక్షంలో సుధాకర్‌ను పట్టణ అధ్యక్షుడిగా ప్రకటించారు. అనంతరం సుధాకర్‌ను నియోజకవర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ లెనిన్, బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షుడు రాఘవులు, గణేష్‌బాబు, జిల్లా కార్యదర్శి జి.సుజాత, స్టేట్ కౌన్సిల్‌మెంబర్ జి.సత్యనారాయణ తదితరులు సత్కరించారు.

కూలీలు గరిష్ట వేతనం పొందేలా పనులు చేయించాలి

● డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి



శావల్యాపురంలో ఉపాధిహామీ పనులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ

శావల్యాపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీలంతా గరిష్ట వేతనం రూ.290 పొందేలా ఫీల్డ్ అసిస్టెంట్‌లు వారితో పనులు చేయించాలని డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి తెలిపారు. శావల్యాపురంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొన్నారు. పని ప్రదేశాల్లో పనులకు హాజరైన కూలీల సమాచారాన్ని పారదర్శకంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఫొటోలు అప్‌లోడ్ చేయాలన్నారు. ఆయనతో బీఎఫ్‌టీ లావణ్య, ఫీల్డ్ అసిస్టెంట్ చెరుకూరి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో అక్రమాలను సహించం: డ్వామా పీడీ

నూజెండ్ల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత ఏడాది జరిగిన ఉపాధి హామీ పనులపై 16వ విడత సోషల్ ఆడిట్ ప్రజా వేదిక స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మండలంలో గత ఏడాది జరిగిన 817 పనుల్లో రూ.12 కోట్ల మేర కూలీలకు, మెటీరియల్‌కు చెల్లించటం జరుగుతుందన్నారు. ఈ పనుల్లో సోషల్ ఆడిట్ బృందాలు సామాజిక తనిఖీలు నిర్వహించగా ఒకే కుటుంబంలో జాబ్ కార్డులు ఉండటం, లింగముక్కపల్లి, నూజెండ్ల తదితర గ్రామాల్లో అంగన్‌వాడీ, ఆషా గ్రామ వలంటీర్లకు కూడా ఉపాధి కూమీ కూలీలుగా నగదు చెల్లించటం జరిగిందని డీఆర్‌పీలు ప్రజా వేదికలో వెల్లడించారు. మండలంలో 4,48,296 ఉపాధి హామి సిబ్బంది నుంచి రికవరీకి ఆదేశించామన్నారు.

ఉత్కంఠంగా ఎడ్ల బండ లాగుడు పోటీలు

నాదెండ్ల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుధవారం నాదెండ్ల గ్రామ సమీపంలోని నందికుంట విఘ్నేశ్వరస్వామి దేవాలయం వద్ద జరుగుతున్న ఎడ్ల బండ లాగుడు పోటీలు ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. న్యూ క్యాటగిరి విభాగంలో 13 జతల ఎద్దులు పాల్గొన్నాయి. చుండూరు మండలం వేటపాలెంకు చెందిన అత్తోట శిరీష్ చౌదరి, శివకృష్ణ చౌదరిల ఎడ్ల జత న్యూ క్యాటగిరి విభాగంలో 4,750 అడుగులు బండ లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. పురుషోత్త పట్నం గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్ సత్తార్ ఎడ్ల జత 4,602 అడుగులు లాగి ద్వితీయ స్థానంలో నిలిచింది. పెదకాకాని మండలం కొప్పురావూరుకు చెందిన తోట శ్రీనివాసరావు ఎడ్ల జత 4,500 అడుగులతో తృతీయ స్థానాన్ని సాధించింది. పత్తిపాడు మండలం పెదగొట్టిపాడుకు చెందిన గరికపాటి లక్ష్మయ్య చౌదరి జత 4,250 అడుగులతో నాల్గో స్థానాన్ని, పత్తిపాడు మండలం పాతమల్లాయపాలెంకు చెందిన సిద్దంశెట్టి సామ్రాజ్యం జత 4,110లతో ఐదో స్థానాన్ని, తెలంగాణ రాష్ట్రం హుజూర్‌నగర్ గ్రామానికి చెందిన జే సహస్ర యాదవ్, బాలఉగ్ర నరసింహస్వామితో పాటు డాక్టర్ హుస్సేన్‌ల కంబైన్డ్ ఎడ్ల జత 4,003 అడుగులతో ఆరో స్థానాన్ని నాదెండ్ల గ్రామానికి చెందిన పాటిబండ్ల రామారావు ఎడ్ల జత 3,750 అడుగులతో 7వ స్థానాన్ని, నరసరావుపేట మండలం దొండపాడుకు చెందిన యర్రం రాజశేఖర్, యశ్వంత్‌ల జత 3393 అడుగులతో 8వ స్థానాన్ని, తోట వల్లూరు మండలం చిన్న పులిపాక గ్రామానికి చెందిన ఆర్ వీఎస్ బుల్స్ జత 3372 అడుగులతో 9వ స్థానాన్ని దక్కించుకున్నాయి.

ఉపయోగకరంగా ఎస్‌సీఈఆర్‌టీ సూచించిన స్టడీ మెటీరియల్: డీఈవో చంద్రకళ

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎస్సీఈఆర్‌టీ సూచించిన పదో తరగతి స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని డీఈవో ఎల్ చంద్రకళ అన్నారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బీ నిర్మలబాయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ ప్రపంచంలో భద్రతా అంశాలను అర్థం చేసుకోవాలి: ప్రదీప్

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సైబర్ ప్రపంచంలో భద్రతా అంశాలను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని జాతీయ భద్రతా డేటాబేస్, సైబర్ సెక్యూరిటీ నిపుణుడు కొత్తపల్లి ప్రదీప్ అన్నారు. బుధవారం జేఎన్‌టీయూ నరసరావుపేట క్యాంపస్‌లో సైబర్ సెక్యూరిటీపై అవగాహన శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కొత్తపల్లి ప్రదీప్ మాట్లాడుతూ పర్సనల్ డేటాను, ఆన్‌లైన్ ఖాతాలను ఎలా రక్షించుకోవాలనే విషయంపై అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జీపీ రాజు, రూరల్ ఏఎస్‌ఐ కే మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదివాసుల నిర్మూలనపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలి: పీడీఎం

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): దండకారణ్యంలో ఆదివాసుల నిర్మూలనపై సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవాలని పీడీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం నరసరావుపేట పట్టణంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎం నాయకులు మాట్లాడుతూ సహజ వనరులను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ అడవుల విధ్వంసం, ఆదివాసులపై మారణహోమానికి పాల్పడుతున్న కేంద్ర బీజేపీ ప్రభుత్వ విధానాలను ఖండించాలన్నారు. మారణహోమంపై న్యాయవిచారణ జరపాలని కోరారు. సమావేశంలో పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, జిల్లా కార్యదర్శి జీ రామకృష్ణ, వై వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, పౌరహక్కుల సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీ శిఖినం చిన్న, బాదుగున్నత శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌ను నూరుశాతం పూర్తిచేయాలి: ఎంపీడీవో

శావల్యాపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను లబ్ధిదారులందరికీ పారదర్శకంగా అందజేసేందుకు ప్రభుత్వం చేపట్టిన హౌస్‌హోల్డ్ ప్రక్రియను సచివాలయ ఉద్యోగులందరూ సంయుక్తంగా కృషిచేసి నూరుశాతం పూర్తి చేయాలని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయాల ఉద్యోగులతో బుధవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. 11 సచివాలయాల పరిధిలో హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో లేని 3433మందిని నమోదు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందని ఎంపీడీవో తెలిపారు.



తిరునాళ్ళ ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు

రాజకీయం కాదు.. భక్తి భావం ముఖ్యం

● రవ్వవరం తిరునాళ్ల ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ శ్రీనివాసరావు
● మొదటిసారి డిజిటల్ బారికేడ్లు.. డ్రోన్లు, సీసీ కెమేరాలతో పర్యవేక్షణ

నూజండ్ల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ దృష్ట్యా రాజకీయ పార్టీల జెండాలు, నాయకుల ఉపన్యాసాలు లేకుండా భక్తి భావంతో తిరునాళ్ల జరుపుకోవాలని ఎస్పీ కంచి శ్రీనివాసరావు సూచించారు. బుధవారం మండలంలోని రవ్వవరం శ్రీకొండగురునాథస్వామి తిరునాళ్ల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. డ్రోన్ కెమేరాతో కొండపై దేవాలయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ నెల 12న జరిగే తిరునాళ్లకు వచ్చే భక్తుల సౌకర్యార్థం పార్కింగ్, కొండపైకి రాకపోకలు, భద్రతా చర్యల గురించి అధికారులకు ఎస్పీ సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తిరునాళ్లలో మొదటిసారిగా డిజిటల్ బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పది డ్రోన్, సీసీ కెమేరాలతో భక్తుల రద్దీని అంచనావేసి సిబ్బందికి సూచనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ నాగేశ్వరరావు, వినుకొండ రూరల్ సీఐ ప్రభాకరరావు, ఐనవోలు ఎస్ఐ కృష్ణారావు, శావల్యాపురం ఎస్ఐ లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐకానిక్ సిటీగా వినుకొండను అభివృద్ధి చేస్తాం: చీఫ్‌విప్ జీవీ

వినుకొండ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వినుకొండను ఐకానిక్ సిటీగా అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలపై జీవీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన అధికారులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినుకొండ ప్రాంత అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సముఖంగా ఉన్నారని, స్థానిక నాయకత్వం రాజకీయాలకు అతీతంగా కలిసివస్తే సమిష్టిగా అభివృద్ధి చేసుకుందామన్నారు. పట్టణానికి అందుబాటులో ఉన్న ఎన్ఎస్‌పీ స్థలంలో 21.49 ఎకరాల్లో టీటీడీ కల్యాణ మండపం, షాదీఖానా, పార్కు, ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్‌పూల్, ముస్లిం మైనార్టీ కాలేజి, పార్కింగ్ స్టాండ్, కమర్షియల్ కాంప్లెక్స్, డిజిటల్ లైబ్రరీ వంటి పనులు చేపడతామన్నారు. 12ఎకరాల డిగ్రీ కళాశాల ఆవరణలో 10ఎకరాలు ఔట్‌డోర్ స్టేడియం, క్రికెట్ మైదానంతోపాటు గ్యాలరీ ఏర్పాటును పూర్తిచేస్తామన్నారు. ఆంధ్ర క్రికెట్ సంఘం సహకారంతో క్రికెట్ స్టేడియంను నిర్మిస్తామన్నారు. కూరగాయల మార్కెట్ వద్ద అధునాతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి కోటి రూపాయలు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మున్సిపల చైర్మన్ డాక్టరు దస్తగిరి, జనసేన ఇన్‌చార్జి రాయల్ నాగశ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఆలపాటి నామినేషన్‌కు తరలిరండి: జీవీ

వినుకొండ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా టీడీపీ సీనియర్ నాయకుడు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఈ నెల 7వ తేదీన గుంటూరులో నామినేషన్ దాఖలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం, జేనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పట్టభద్రులు పెద్దఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కోటప్పకొండ తిరునాళ్లకు పట్టణంలో ఏర్పాట్లు

● రూ.40 లక్షలు కేటాయించిన మునిసిపాలిటీ



డివైడర్‌కు రంగులు వేస్తున్న కార్మికులు

నరసరావుపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వర స్వామి తిరునాళ్లను పురస్కరించుకొని మునిసిపాలిటీ భక్తుల కోసం పట్టణంలో ఏర్పాట్లు చేస్తోంది. రూ.40లక్షల నిధులు ఏర్పాట్లకు కేటాయించటంతో పనులు ప్రారంభమయ్యాయి. కోటప్పకొండ తిరునాళ్లకు వెళ్లి, తిరిగి వచ్చే భక్తుల కోసం తాగునీరు.. మరుగుదొడ్ల వసతి కల్పించనున్నారు. రూ.20 లక్షలు వెచ్చించి డివైడర్లకు రంగులు వేస్తున్నారు. రూ.10 లక్షల వ్యయంతో పట్టణంలోని రహదారులను విద్యుత్ దీపాలతో అలంకరించనున్నారు. పట్టణ నడిబొడ్డులోని మహాశివుని విగ్రహానికి రంగులు.. తిరునాళ్ల మూడు రోజులు విద్యుత్ దీపాలు.. పూలతో అలంకరించనున్నారు. ఇందుకు రూ.3లక్షలు కేటాయించారు. తిరునాళ్లకు వచ్చే భక్తులకు స్వాగతం పలుకుతూ మునిసిపాలిటీ ఫ్లెక్సీలకు ఏర్పాటు చేయనున్నది. డివైడర్‌లకు రంగులువేసే పనులు చురుగ్గా జరుగుతున్నాయి. కమిషనర్ జస్వంతరావు పనులను పర్యవేక్షిస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

బొల్లాపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంగుపల్లి తండాలో విద్యుత్ షాక్‌తో తుపాకుల కాశేశ్వరరావు(30 బుధవారం మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. తుపాకుల కాశేశ్వరరావు స్వగ్రామం వినుకొండ మండలం కొత్తపాలెం గ్రామం కాగా 20 రోజుల క్రితం బొల్లాపల్లి మండలం గంగుపల్లి తండాకు మిరపకాయలు కోసేందుకు వచ్చి అక్కడే నివాసం ఉంటున్నాడు. బుధవారం ఉదయం సమీపంలోని రైతులు పొలాలకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగలటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లూర్దుమేరీ, నాలుగు నెలల పాప ఉన్నారు. కాశేశ్వరరావు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.